
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 25 జూలై 2025



రత్నాచల్ సహా పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగర శివారునున్న తాడి-దువ్వాడ స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 26, 28, 30 తేదీల్లో విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విజయవాడ-విశాఖ ... మిగతా 6వ పేజీలో



మెట్రో రైలు ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్

నేడు టెండర్లు

- ప్రాజెక్టు వ్యయం రూ.11,498 కోట్లు
- 60 శాతం నిధులు పీపీపీలో సేకరణ
- 40 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించాలని నిర్ణయం
- రాష్ట్ర వాటా నిధులు సమకూర్చే బాధ్యత వీఎంఆర్‌డీఏకు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు శుక్రవారం టెండర్లు పిలవనున్నారు. ఈ ప్రాజెక్టుదశాబ్ద కాలంగా నలుగుతోంది. ఇప్పటి వరకూ దీనికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఖరారు కాలేదు. వంద శాతం నిధులు కేంద్రం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుండగా ఢిల్లీ నుంచి స్పందన కనిపించడం లేదు. దాంతో నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం చెరో సగం భరించాలనే ప్రాతిపదికన తొలుత టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒకవైపు కేంద్రం నుంచి పూర్తిసాయం కోసం ప్రయత్నం చేస్తూనే దానికి ఆమోదం లభించే లోపు పనులు పట్టాలపైకి తేవాలని ఈ టెండర్లను పిలుస్తున్నట్టు సమాచారం.

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశకు రూ.11,498 కోట్లు అవసరమని అంచనా వేశారు. స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు మూడు కారిడార్లు నిర్మిస్తారు. వీటి పొడవు 46.43 కిలోమీటర్లు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.8 ఎకరాలు అవసరం కాగా అందులో ప్రైవేటు భూములు పది ఎకరాల వరకూ ఉన్నాయి. వాటికి జీవీఎంసీ ద్వారా టీడీఆర్‌లు ఇవ్వాలని యోచిస్తున్నారు. టెండర్ల లెక్కల ప్రకారం ప్రాజెక్టు వ్యయంలో 60 శాతం పీపీపీ విధానంలో సమీకరిస్తారు. మిగిలిన 40 శాతంలో రాష్ట్ర వాటా 20 శాతం కాగా దానిని వీఎంఆర్‌డీఏ సమకూర్చాల్సి ఉంది. అందులో భూ సేకరణ, ఇతర ఖర్చులు ఉంటాయి. దీనికి సుమారు రూ.882 కోట్లు నిధులు కావాలని అంచనా వేశారు.

ఐటీ హబ్‌గా విశాఖ

పలు కంపెనీలకు భూ కేటాయింపులు

మంత్రి మండలి ఆమోదం

- ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ఫీనమ్ పీపుల్, సిఫీ ఇన్ఫినిటీ స్పేసెస్, సత్వ, బీవీఎం ఎనర్జీ, ఏఎన్ఎస్ఆర్ సంస్థల రాక
- మెడ్‌టెక్ జోన్‌లో లాన్సమ్ 5 స్టార్ హోటల్
- సిటీలో ఐటీసీ హోటల్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

పెట్టుబడిదారులను ప్రోత్సహించి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో పలు సంస్థలకు భూములు కేటాయించింది. ఎకరా రూ.30 కోట్లకు పైగా విలువ చేసే భూములను 5 శాతం, అంత కంటే తక్కువ ధరకు ఇచ్చింది. మధురవాడ, రుషికొండ, ఎండాడ ప్రాంతాల వైపు భూములు కేటాయిస్తూ గురువారం నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ సంస్థల రాకతో ఐటీ రంగంలో విశాఖపట్నం అగ్రస్థానానికి చేరనుంది. డేటా హబ్‌గా మారుతుంది.



- **బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ:** ఈ సంస్థకు ఎండాడలో పనోరమ హిల్స్ వెనుక ఒకేచోట ఏపీఐఐసీ ద్వారా 30 ఎకరాలు కేటాయించారు. వీరు రూ.1,250 కోట్ల పెట్టుబడి పెట్టి 15 వేల మందికి ఉపాధి కల్పిస్తారు. ఎకరా రూ.1.5 కోట్లకు ఇచ్చారు.
- **ఫీనమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్:** ఈ సంస్థకు మొత్తం 4.45 ఎకరాలు కేటాయించారు. రుషికొండ హిల్ నంబరు 2లోని నాన్ సెజ్ ఏరియాలో 45 సెంట్లు, మధురవాడ హిల్ నంబరు 4లో నాలుగు ఎకరాలు కేటాయించారు. వీరు దశల వారీగా ఐదేళ్లలో 2,500 మందికి ఉద్యోగాలు కల్పిస్తారు. ఏడాదిలో క్యాంపస్ ఏర్పాటు చేసి, రెండేళ్లలో 1,250 మందికి, ఆ తరువాత మరో రెండేళ్లలో ఇంకో 1,250 మందికి ఉద్యోగాలు ఇస్తారు. వీరి పెట్టుబడి రూ.207.5 కోట్లు కాగా వారికి ఎకరాకు రూ.4.05 కోట్ల చొప్పున ధర నిర్ణయించారు.
- **సిఫీ ఇన్ఫినిటీ స్పేస్:** ఈ సంస్థకు రుషికొండ హిల్ నంబర్ 3లో 3.6 ఎకరాలు ఎకరా కోటి రూపాయల చొప్పున ఇచ్చారు. అదేవిధంగా పరదేశిపాలెంలో 50 ఎకరాలు, ఎకరా కేవలం రూ.50 లక్షలకు ఇచ్చారు. వీరు రూ.16,466 కోట్లు పెట్టుబడి పెట్టి 600 మందికి ఉద్యోగాలు ఇస్తారు. ఈ సంస్థ కీలకమైన డేటా హబ్‌ను అభివృద్ధి చేస్తుంది. డేటా స్టోరేజ్, క్లౌడ్ కంప్యూటింగ్‌లను అభివృద్ధి చేస్తుంది. దీని ద్వారా మరింత మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.
- **సాత్వా డెవలపర్స్:** ఈ సంస్థకు మధురవాడలోని హిల్ నంబరు 4లో 30 ఎకరాలు, ఎకరా రూ.1.5 కోట్లు చొప్పున కేటాయించారు. వీరు రూ.1,500 కోట్ల పెట్టుబడితోనే 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఒప్పందం చేశారు.
- **ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్:** ఈ సంస్థకు రుషికొండ హిల్ నంబరు 3పై 2.5 ఎకరాలు, మధురవాడ హిల్ నంబరు 4లో 7.79 ఎకరాలు కేటాయించారు. వీరు ... మిగతా 6వ పేజీలో

ఫ్యూచర్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్

- విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో 1,914 ఎకరాలు - 6వ పేజీలో
- వీఆర్ఎండీఏ ప్రణాళికకు మంత్రిమండలి ఆమోదం

పల్లా భవనం కూల్చివేత వ్యవహారం...

ముగ్గురిపై వేటు

- నాటి గాజువాక జోన్ డీసీపీ నరేందర్‌రెడ్డి, టీపీఓ వినయ్ ప్రసాద్, టీపీఎస్ వరప్రసాద్ సస్పెన్షన్
- అప్పటి సీసీపీ ఆర్జే విద్యుల్లత, సిటీప్లానర్ ప్రభాకర్, జెడ్సీ శ్రీధర్‌కు షోకాజ్
- 2019 డిసెంబరు 21వ తేదీ తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్ కూల్చివేత
- జాతీయ రహదారి విస్తరణకు తగిన స్థలం వదలలేదని వాదన
- నాటి వైసీపీ పెద్దల ఒత్తిడికి తలొగ్గారని విమర్శలు



పల్లా శ్రీనివాసరావుకు చెందిన భవనం కూల్చివేత (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గాజువాక ఎమ్మెల్యేగా ఉన్న పల్లా శ్రీనివాసరావుకు చెందిన భవనం కూల్చివేతలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నాటి జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. రాజకీయ పలుకుబడికి తలొగ్గి దౌర్జన్యంగా యంత్రాలతో భవనాన్ని కూల్చివేయడంలో కీలకంగా వ్యవహరించిన అప్పటి గాజువాక జోన్ డీసీపీ నరేందర్‌రెడ్డి, టీపీఓ వినయ్‌ప్రసాద్, టీపీఎస్ వరప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే అప్పటి చీఫ్ సిటీ ప్లానర్ ఆర్జే విద్యుల్లత, సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, జోనల్ కమిషనర్ శ్రీధర్‌లకు షోకాజ్ నోటీసులు జారీచేసింది.

జాతీయ రహదారిని ఆనుకుని గాజువాక సర్వే నంబర్లు 5/1, 5/3లో ఉన్న 864.33 చదరపు మీటర్ల స్థలంలో సెల్లార్+జీ+4 నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు 2019 డిసెంబరు 21న ఆన్‌లైన్‌లో ప్లాన్ (ప్లాన్ నంబర్ బీఏ నంబర్1086/3055/బి/జెడ్5/జీవీడీ/2019) తీసుకున్నారు. దీని ప్రకారం భవన నిర్మాణ పనులు చేపడుతుండగా, అప్పటి వైసీపీ పెద్దలు రాజకీయ దురుద్దేశంతో భవనాన్ని కూల్చివేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. దీంతో అప్పటి కమిషనర్ సృజన, చీఫ్ సిటీప్లానర్ ఆర్జే విద్యుల్లత ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు 2021 ఏప్రిల్ 25న అర్ధరాత్రి యంత్రాలతో భవనం వద్దకు చేరుకున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో జాతీయ రహదారిని 266 అడుగులకు విస్తరించాలనే ప్రతిపాదన ఉందని, ఆ మేరకు స్థలాన్ని విడిచిపెట్టకుండా భవన నిర్మాణం చేస్తున్నారంటూ అప్పటికప్పుడు నోటీసుని గోడకు అతికించి తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కూల్చివేత ప్రారంభించారు. ఉదయం ఆరు గంటలయ్యేసరికి భవనం నేలమట్టం చేసి ... మిగతా 6వ పేజీలో

గ్రేటర్ కమిషనర్‌పై గుర్రు

తమ విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదని టీడీపీ కార్పొరేటర్ల ఆరోపణ

- కలిసేందుకు వెళితే గంటల తరబడి కూర్చోబెడుతున్నారని ఆవేదన
- ఫ్లోర్‌లీడర్ కార్యాలయంలో పలువురు సమావేశం
- తొలుత మేయర్‌కు ఫిర్యాదు చేయాలని, అప్పటికీ పరిస్థితి మారకుంటే కౌన్సిల్‌లో ఎండగట్టాలని నిర్ణయం



జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌పై టీడీపీ కార్పొరేటర్లు తీవ్ర అసహనంతో ఉన్నారు. తమను కమిషనర్ కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులోని సమస్యల పరిష్కారానికి వినతిపత్రం ఇవ్వడానికి వెళితే గంటల తరబడి బయట కూర్చోబెడుతున్నారని, ఇచ్చిన విజ్ఞప్తులపై కనీసం సంతకం చేయడం లేదని ఆరోపిస్తున్నారు. గురువారం టీడీపీ ఫ్లోర్ లీడర్ ఛాంబర్‌లో పలువురు కార్పొరేటర్లు భేటీ అయి కమిషనర్ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేయడంతోపాటు మేయర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్‌గార్గ్ గత నెల 21న బాధ్యతలు స్వీకరించారు. ఆయన వార్డుల్లో విస్తృతంగా పర్యటించడంతోపాటు అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. అలాగే అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి జీవీఎంసీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై అవగాహన తెచ్చుకుంటున్నారు. నిత్యం వీడియో కాన్ఫరెన్స్‌లు, సమీక్షలు, సమావేశాలతో బిజీగా గడుపుతున్నారు. గత కమిషనర్‌ల మాదిరిగా కార్పొరేటర్లకు పెద్దగా సమయం కేటాయించడం లేదు. అధికార, ప్రతిపక్ష అనే భేదం లేకుండా ఎవరైనా కార్పొరేటర్లు తనను కలిసేందుకు వస్తే..వీలు దొరికినప్పుడు వారిని లోపలకు పిలిచి సమస్యలను వింటున్నారు. ఈ క్రమంలో కొన్నిసార్లు కార్పొరేటర్లు ఎక్కువసేపు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది వైసీపీ కార్పొరేటర్లకు పెద్దగా ఇబ్బంది అనిపించకపోయినా, అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన కార్పొరేటర్లకు మాత్రం మింగుడుపడడం లేదు. అధికార పార్టీ కార్పొరేటర్లమైన తాము కమిషనర్‌ను కలిసేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం అవమానకరమేనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం టీడీపీ ఫ్లోర్ లీడర్ ఛాంబర్‌లో కొందరు కార్పొరేటర్లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ పనితీరు గురించి చర్చకు రాగా, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఇద్దరు జోక్యం చేసుకుని ఇటీవల తామిద్దరం కలిసి కమిషనర్‌ను కలిసేందుకు వెళితే రెండు గంటలపాటు నిరీక్షించినా తమను పిలవలేదని, దీంతో విసిగిపోయి వెళ్లిపోయామని అన్నారు. మరికొందరు కార్పొరేటర్లు కల్పించుకుని తమది కూడా అదే పరిస్థితి అని, తాము ఎప్పుడు కమిషనర్‌ను కలవాలని వెళ్లినా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. వార్డు సమస్యలపై గతంలో కమిషనర్‌లకు వినతిపత్రం అందజేస్తే, వెంటనే దానిపై 'ఫైల్ పుటప్' అనో, కమిషనర్ సంతకం చేసో.. సంబంధిత విభాగం అధికారులకు పంపించేవారని, దానిపై చర్యలు కనిపించేవని ఇంకొందరు అన్నారు. కానీ ప్రస్తుత కమిషనర్ తమ నుంచి వినతిపత్రం అందుకుని పక్కనపడేస్తున్నారని, సంతకం చేసి నోట్ చేసుకోండి సార్...అని చెప్పినా తర్వాత చేస్తానంటూ పంపించేస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ తీరు ఇలాగే ఉంటే వార్డుల్లో అభివృద్ధి పనులు జరగవని, ప్రజల సమస్యలు తీరవని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై తొలుత మేయర్‌కు ఫిర్యాదు చేయాలని, అప్పటికీ పరిస్థితి మారకుంటే కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ తీరును ఎండగట్టాలని నిర్ణయించారు. ఈ సమస్య ఒకరిద్దరు కార్పొరేటర్లది కాదని, అందరూ అలాగే బాధపడుతున్నారని వారంతా పేర్కొనడం విశేషం.

మహిళలకు ఉచిత ప్రయాణం

- ఆగస్టు 15 నుంచి ప్రారంభం
- ఆర్టీసీ అధికారుల సన్నాహాలు
- ప్రస్తుతం రోజుకు 82,500 మంది మహిళల ప్రయాణం
- ఉచితంతో మరో పది శాతం పెరగవచ్చునని అంచనా
- అందుకు అనుగుణంగా బస్సులు సిద్ధం

ద్వారకా బస్‌స్టేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి విశాఖ రీజియన్ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 15వ నుంచి దీనిని అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో వారం రోజుల్లో విధి విధానాలు రానున్నట్టు సమాచారం అందడంతో అధికారులు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రస్తుతం విశాఖ రీజియన్‌లో 780 బస్సులు ఉన్నాయి. వీటిద్వారా రోజూ 3.2 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో స్టూడెంట్ ఉచిత/రాయితీ పాస్ హోల్డర్లు, ఉచిత పాస్ కలిగిన దివ్యాంగులు, ఎన్జీఓ పాస్ హోల్డర్స్ 1.55 లక్షల మంది, సాధారణ ప్రయాణికులు 1.65 లక్షల మంది ఉన్నారు. సాధారణ ప్రయాణికుల్లో 50 శాతం మంది అంటే 82,500 మంది మహిళలు ఉంటారు. ఉచితం అమలులోకి వస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య మరో పది శాతం పెరిగే అవకాశం ఉందని ఆర్టీసీ రీజియన్ అధికారులు అంచనా వేస్తున్నారు.



బస్సుల సంసిద్ధత గురించి అధికారులను, సాంకేతిక నిపుణులను అడిగి తెలుసుకుంటున్న ఆర్ఎం బి అప్పలనాయుడు

మహిళలకు ఉచిత రవాణా అవకాశం ఆర్డినరీ/పల్లెవెలుగు సర్వీసుల్లో మాత్రమే ఉంటుందా, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు కూడా వర్తిస్తుందా అన్న విషయం తేలాల్సి ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. సిటీ ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులకు ఈ పథకం వర్తింపజేస్తే ప్రస్తుతం రీజియన్‌లో ఉన్న 300 ఆర్డినరీ/పల్లెవెలుగు బస్సులను ఎలా సర్దుబాటు చేయాలనే దానిపై ... మిగతా 6వ పేజీలో

బస్సుల లెక్క...

ఆర్డినరీ సర్వీసులు	300
గ్యారేజీలో ఉన్న స్పేర్	30 (ఆర్డినరీ)
మొత్తం	330
పల్లె వెలుగులు	3
ఎక్స్‌ప్రెస్‌లు	40
మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు	160
సూపర్ లగ్జరీ	42
ఆల్ట్రా డీలక్స్	38
గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్‌రైడర్, క్రూయిజ్, స్లీపర్ సర్వీస్, ఏసీ లగ్జరీ	167



ముసురు

- జల్లులతో చల్లబడిన వాతావరణం
- నేడు, రేపు వర్షాలు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం నగరంలో ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మేఘాలు ఆవరించాయి. మధ్యాహ్నం మూడు గంటల తరువాత చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. రాత్రి వరకూ కొనసాగాయి. శుక్రవారం జిల్లాలో వర్షం కొనసాగుతుంది. అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.



రికవరీ చేసిన బంగారాన్ని బాధితురాలికి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

59 చోరీ కేసుల్లో 73 మంది అరెస్టు

- రూ.1.06 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం
- బాధితులకు అందజేత

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నెల (జూన్) 84 చోరీలు జరిగితే వాటిలో 59 కేసులను ఛేదించినట్టు సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు. ఆ కేసుల్లో రికవరీ చేసిన సొత్తును గురువారం కమిషనరేట్ ఆవరణలోని సమావేశ మందిరంలో జరిగిన క్రైమ్ మేళాలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నేరాల నియంత్రణకు ఒక వైపు ... మిగతా 6వ పేజీలో

జడ్పీ బిల్లులకు మోక్షం

- రూ.20 కోట్లు అంచనా
- పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో సభ్యుల ఆందోళన
- ఎట్టకేలకు సుమారు 300 పనులకు సంబంధించి రూ.11.75 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ
- గత ఆర్థిక సంవత్సరం ఉమ్మడి జిల్లాలో 400 పనులు మంజూరు



పూర్తయిన వడ్డాది బస్ షెల్టర్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధులతో చేపట్టిన పనులకు ఎట్టకేలకు బిల్లులు మంజూరుచేశారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.11.75 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాలకు జమ అయ్యాయి. సాధారణ నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు కావడం లేదంటూ జడ్పీ సర్వసభ్య సమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో సభ్యులు ఆందోళన వ్యక్తంచేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గత నెల వరకూ అప్‌లోడ్ చేసిన పనులకు సంబంధించి బిల్లులు మంజూరుకావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జడ్పీ నిధుల వినియోగంపై అనేక ఆంక్షలు విధించింది. చివరకు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను ఇతర అవసరాలకు మళ్లించింది. దీంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. గత ఏడాది ఏప్రిల్ అంటే ఎన్నికల సమయం నుంచి పనులను ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్లు ముందుకువచ్చారు. జడ్పీటీసీ సభ్యులు తమ మండల పరిధిలో రోడ్లు, మరమ్మతులు, మురుగుకాల్వల నిర్మాణానికి సాధారణ నిధులు కేటాయిస్తుంటారు. గత ఆర్థిక సంవత్సరం ఉమ్మడి ... మిగతా 6వ పేజీలో

కిడ్నీ బాధితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- భద్రయ్యపేట గ్రామం సందర్శన

పద్మనాభం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గురువారం ఆయన రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని భద్రయ్యపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాఠశాల వద్ద ప్రజలతో మాట్లాడారు. రోగుల ఆరోగ్య సమస్యలను విన్నారు. ఎప్పటి నుంచి సమస్య ఉందని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందించాలని అధికారులను ఆదేశించారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో తాగు నీటి పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.గ్రామస్థులు తాగుతున్న నీరు ప్రమాణాలకు తగ్గట్టుగానే ఉందని, అయినప్పటికీ తాగునీటిని రాజమండ్రి ల్యాబ్‌కు పంపిస్తామని గ్రామీణ నీటి సరఫరా శాఖాధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు మాట్లాడుతూ సీరం క్రియాటినెస్ 4 కంటే ఎక్కువగా ఒక మహిళలకు ఉందన్నారు. కాగా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడానికి ఆర్‌ఓ ప్లాంటును ఏర్పాటుకు ఎమ్మెల్యే గంటా మిత్రుడు కంచర్ల రాంప్రసాద్ ముందుకు వచ్చారు. వైద్యంతో పాటు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, నాయకులు నగేష్‌కుమార్, అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, అప్పలనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

'ఎన్నికల హామీలు అమలు చేస్తాం'

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని ఎమ్మెల్యే గంటా చెప్పారు. రెడ్డిపల్లి పంచాయతీ సుంకరిపేటలో గురువారం నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదరరావు, రమణ, నగేష్‌కుమార్, నందీశ్వరరావు, సత్యనారాయణ, రామరాజు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతి

కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు మృతులకు ఆర్థిక సహాయం వచ్చేలా చూడాలని కోరుతూ మండల బీజేపీ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం వారు నగరంలో మాధవ్‌ను కలిసి గ్రామంలో పరిస్థితిని వివరించారు. ఇప్పటికే పలువురు మృతి చెందారని,రేవిడి పీహెచ్‌సీ వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో 50 మంది వరకు వ్యాధిబారిన పడినట్టు గుర్తించారన్నారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రికి తెలిపి ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మెడికల్ విభాగం ఏపీ కన్వీనరు రవికుమార్, మండల అధ్యక్షురాలు నాగమణి, నాయకులు ప్రకాష్‌రెడ్డి, కృష్ణారావు, సోమేశ్వరరావు, వెంకటరావు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎనిమిది మందికి సీఎం రిలీఫ్ ఫండ్

భీమునిపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఎనిమిది మందికి మంజూరైన సీఎం సహాయ నిధి పత్రాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది మందికి రూ. 6.14 లక్షల ఆర్థిక సహాయం మంజూరైనట్టు చెప్పారు. 5వ వార్డు బొట్టవానిపాలెంకు చెందిన నమ్మి వెంకట సాయి హేమంత్‌కు రూ. 1.29 లక్షలు, 6వ వార్డు పీఎంపాలెంకు చెందిన మొజ్జాడ ఇందిరకు రూ. 1.17 లక్షలు, ధూళిపూడి ఆంజనేయులుకు రూ. 80 వేలు, పద్మనాభం మండలం మద్ది గ్రామానికి చెందిన బుగత సన్యాసినాయుడుకు రూ. 84 వేలు, 8వ వార్డు ఎన్టీఆర్ కాలనీ నివాసి నక్క ప్రభాకర్‌రావుకు రూ. 50 వేలు, ఆనందపురం మండలం పాలవలస గ్రామానికి చెందిన కొల్లి శ్రీనుకు రూ. 35 వేలు మంజూరైందన్నారు. ఆపదలో ఉన్న బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.



బాధితులకు మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధురవాడ, శివశక్తినగర్, ఆర్‌టీసీ కాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం, చంద్రంపాలెం, రేవళ్లపాలెం, దుర్గానగర్, వాంబేకాలనీ,స్వతంత్రనగర్‌కాలనీ, గణేశ్‌నగర్, సాయిప్రియ లేఅవుట్, వల్లీనగర్, దుర్గానగర్, వుడాకాలనీ, ఎన్‌జీఓ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొమ్మాది : కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని పీఎంపాలెం ఏఈ నరేశ్ తెలిపారు. కొమ్మాది జంక్షన్, వైభవ్ నగర్, ప్రశాంతినగర్, వసంత్ విహార్, విజయం పాఠశాల, టీచర్స్ లేఅవుట్, రిక్షాకాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో 'తొలి అడుగు'

కొమ్మాది, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు అన్నారు. ఆరో వార్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో వార్డు యువ నాయకుడు గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జేవీ అగ్రహారంలో...

భీమునిపట్నం : పట్టణంలోని 4వ వార్డు జేవీ అగ్రహారంలో శుక్రవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం జరగనున్నట్టు వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరుకానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రూ. 77. 55 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు,కాలువల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాషువా వర్ధంతి

భీమునిపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశ్వకవి గుర్రం జాషువా వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ, అధ్యాపకులు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల సమస్యలపై ఆయన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డారన్నారు. ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.



జాషువా చిత్రపటానికి పూలమాల వేస్తున్న విద్యార్థి

తగరపువలసలో 'వీరమల్లు' సందడి

తగరపువలస, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం, సినీ హీరో పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా గురువారం తగరపువలస గణేశ్ థియేటర్ వద్ద ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు సందడి చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి కేక్ కట్ చేసి, ప్రేక్షకులకు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పరిమి ప్రీతం, పందిరి తారకేశ్, రమేశ్, బంగారుతల్లి, రాంబాబు. హైమ, మంజుల పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న కార్యకర్తలు, వీర మహిళలు

గోస్తనీ నదిలో వ్యర్థాల పారబోత



నగరపాలెం వద్ద నదిలో పారబోస్తున్న చెత్త

భీమునిపట్నం (రూరల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరంపాలెం వద్ద గోస్తనీ నదిలో కొంతమంది వ్యర్థాలను పారబోస్తున్నారు. కోళ్ల వ్యర్థాలను, వీధుల్లో ఊడ్చిన చెత్తను వాహనాలపై తీసుకువచ్చి నదిలో వేస్తున్నారు. దీంతో నదిలోని జలాలు కలుషితమవుతున్నాయి. మండలంలో నాలుగు పంచాయతీలకు తాగునీరు నదిలోని రక్షిత మంచినీటి పథకాల ద్వారా సరఫరా అవుతోంది. చిప్పాడలోని దివీస్ కంపెనీకి కూడా నది నుంచే నీటిని తరలిస్తున్నారు. ఈనేపథ్యంలో నీటి కాలుష్యం వల్ల ఎప్పుడు ఏ రోగాల బారిన పడాల్సి వస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంప్రదాయబద్ధంగా సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గంగధార వద్ద ఉన్న సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీరాముడి జన్మ నక్షత్రం పునర్వసు పురస్కరించుకుని లోక కల్యాణార్థం ఈ కార్యక్రమాన్ని జరిపారు. తొలుత సీతారామ, లక్ష్మణ, హనుమ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. బింబారాధన, మండపారాధన, కలశారాధన చేసి హోమకుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు.దేవస్థానం స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో రుత్విక్‌లు శ్రీమద్రామాయణంలోని బాలకాండ (సంక్షిప్త రామాయణం)ను, శ్రీరామ షడక్షరీ మంత్ర జపంతో హవనం చేసి మహాపూర్ణాహుతి జరిపారు. పూజలు తరువాత ప్రధాన కలశాన్ని అంతరాలయంలో రాముడి వద్ద ఉంచి పూజలు చేసి, అందులోని జలాలతో భక్తులను ప్రోక్షణ చేశారు.

వార్డుల్లో పరిసరాల పరిశుభ్రత

భీమునిపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్యం మెరుగుపై జీవీఎంసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రతి రోజూ శానిటేషన్ పనులు చేస్తున్నప్పటికీ కొన్నిచోట్ల చెత్త ఉంటోంది. ఈమేరకు వార్డుల్లో గ్యాంగ్ వర్క్‌లు చేయాలని నిర్ణయించారు. రోజువారీ పనులతో పాటు ప్రత్యేకంగా పది మంది పురుషులు, పది మంది మహిళా వర్కర్లతో ఒక ప్రాంతాన్ని గుర్తించి గ్యాంగ్ వర్క్ నిర్వహిస్తున్నారు. దీనివల్ల రహదారులు శుభ్రపరచడమే కాకుండా రహదారిని ఆనుకుని పెరిగిన మొక్కలను తొలగిస్తున్నారు. గురువారం నరసింహస్వామి ఆలయం నుంచి ఏబీ చర్చి, అప్పికొండ వీధి మీదుగా చిన్నబజారు జంక్షన్ వరకూ గ్యాంగ్ వర్క్ చేయించారు. ప్రతిరోజూ ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో ఈ పనులు చేస్తామని శానిటేషన్ విభాగం అధికారులు తెలిపారు.



నరసింహస్వామి ఆలయం రోడ్డులో పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఘనంగా అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

సింహాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అడివివరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమం పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి పోరాటం గురించి వివరించారు. గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం మూర్తి, న్యాయవాది కె. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ స్వర్ణ పుష్పాలతో పూజలు జరిపారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు.

3న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

భీమునిపట్నం (రూరల్), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎంవీపీ డబుల్ రోడ్డులో ఉన్న ఐఐఎం బిజినెస్ స్కూల్లో వచ్చే నెల 3న జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు యోగా స్పోర్ట్స్ సంస్థ ప్రతినిధి, తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టీఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీలు ఉదయం 8 గంటల నుంచి జరుగుతాయని, 9 నుంచి 14 ఏళ్లలోపు వారికి ఒక విభాగంగాను, 14 నుంచి 18, 18 నుంచి 28, 28 నుంచి 35, 35 నుంచి 45, 45 నుంచి 55 ఏళ్ల వారికి వేర్వేరుగా పోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

అమావాస్య పూజలు

సింహాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆషాడమాస బహుళపక్ష అమావాస్య పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి దేవళంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం స్వామివారి రాజభోగం నివేదన సమయంలో సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి ప్రధాన మాడవీధుల్లో తిరువీధి జరిపారు. మార్గమధ్యలో అష్టదిక్పాలకులకు ప్రత్యేక పూజలు చేసి, గ్రామబలిహరణం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో ఊరేగించారు.

భైరవస్వామికి భక్తుల పూజలు



భైరవునికి నీరాజనాలిస్తున్న అర్చకుడు

సింహాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి అనుబంధ ఆలయం, సింహాచలం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న భైరవస్వామిని భక్తులు గురువారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆషాడమాస అమావాస్య కావడంతో సూర్యోదయానికి ముందే ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వందలాది మంది సింహాచలం చేరుకున్నారు. కొండదిగువ పుష్కరిణిలో స్నానాలు చేసి భైరవస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి అమృతకలశాలు, వడమాలలు సమర్పించిన తరువాత కొందరు కాలినడకన, మరికొందరు బస్సుల్లోనూ సింహగిరికి చేరుకుని అప్పన్నను దర్శించుకున్నారు. భక్తుల రద్దీని ముందుగానే ఊహించిన సింహాచలం దేవస్థానం ఏఈఓ పంతం శ్రీనివాస్, పర్యవేక్షణాధికారి రమణరావు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు.

గ్రామ దేవతలకు సారె సమర్పణ



అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

సింహాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి సోదరీమణులు, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతలు పైడితల్లెమ్మ, బంగారమ్మకు భక్తులు గురువారం సారె సమర్పించారు. అషాడ మాసం ముగింపు సందర్భంగా ప్రియాగార్డెన్స్, అడివివరం, విజినిగిరిపాలెం, పోస్టాఫీసు వీధి, తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు మేళతాళాలతో తొలిపావంచా వద్ద పూజలు చేసి సారెను ఊరేంగించారు. తొలుత పైడితల్లెమ్మ, తరువాత బంగారమ్మ ఆలయాలకు చేరుకుని వంటకాలు, పండ్లు నివేదించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.

ఏరియల్ సీడింగ్‌తో సత్ఫలితాలు



కంబాల కొండపై ఏపుగా పెరిగిన చెట్లు

మధురవాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కొండలపై పచ్చదనం పెంపు కోసం అటవీ శాఖాధికారులు ఆరేళ్ల కిందట చేసిన ప్రయత్నం సత్ఫలితం ఇచ్చింది. మధురవాడ పరిసరాల్లోని కొండలపై పచ్చదనం పెంచడానికి ఆరేళ్ల కిందట అటవీ శాఖాధికారులు ఏరియల్ సీడింగ్ చేపట్టారు. సుమారు 15 కొండలపై హెలీకాప్టర్ ద్వారా వివిధ రకాల మొక్కల విత్తనాలను వెదజల్లారు. అవి మొలకెత్తి ఇప్పుడు చెట్లుగా ఎదిగి పచ్చదనాన్ని అందిస్తున్నాయి. కొండలన్నీ చెట్లతో కళకళలాడుతున్నాయి. అలాగే కొంతమంది పర్యావరణ ప్రేమికులు కూడా కొండలపై ఏటా వేసవిలో పలు విత్తనాలతో విత్తన బంతులు తయారు చేసి వాటిని కొండలపై వెదజల్లారు.అవి కూడా ఇప్పుడు ఏపుగా ఎదిగి పచ్చదనంతో నిండుగా కనిపిస్తున్నాయి.

వ్యాధుల కాలం.. అప్రమత్తం

సింహాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం వైద్యులు సూచించారు. రాష్ట్రీయ బాలల ఆరోగ్యరక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం వారు పాత అడివివరం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్‌టీపీ విద్యావతి, ఐఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మళ్లీ భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) చేపట్టాలని నిర్ణయించింది. దీనికి రాష్ట్ర మంత్రి మండలి గురువారం పచ్చ జెండా ఊపింది. విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో అవసరమయ్యే భూముల కోసం ముందుగానే వీఎంఆర్‌డీఏ ప్రణాళిక రూపొందించుకుంది. ఇటు అనకాపల్లి, అటు విజయనగరం రెండు జిల్లాల వైపు నగరం విస్తరిస్తున్నందున జాతీయ రహదారికి సమీపంలో ఉన్న భూములను సమీకరించాలని భావిస్తోంది. విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో మొత్తం 1,914 ఎకరాలు సమీకరించాలని నిర్ణయించినట్టు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ గురువారం 'ఆంధ్రజ్యోతి'కి గురువారం తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుందన్నారు. భూములకు సంబంధించిన రికార్డులన్నీ రెవెన్యూ శాఖ వద్దనే ఉన్నందున, వారినే భూ సమీకరణ చేయాలని కోరామన్నారు. అనకాపల్లిలోని చెర్లోపల్లి ఖండంలో 2007 నుంచి భూ సమీకరణ చేయాలని భావిస్తున్న 58.18 ఎకరాలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

ఐటీ హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.వేయి కోట్ల పెట్టుబడితో పది వేల మందికి ఉద్యోగాలు ఇవ్వనున్నారు.

అగనంపూడి సమీపానున్న ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో 5 స్టార్ హోటల్ ఏర్పాటుకు లాన్సమ్ లీజర్స్ సంస్థ ఒప్పందం చేసింది. అదేవిధంగా కోల్‌కతాకు చెందిన ఐటీసీ కంపెనీ కూడా విశాఖలో 5 స్టార్ హోటల్ ఏర్పాటుకు ముందుకురాగా దానికి కూడా తగిన భూములు ఇవ్వడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

ముగ్గురిపై వేటు

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోయారు. తన భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా, రాజకీయ పలుకుబడికి తలొగ్గి కూల్చివేశారంటూ అప్పటి ప్రభుత్వానికి పల్లా శ్రీనివాసరావు ఫిర్యాదుచేశారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని పల్లా కోరారు. దీంతో మునిసిపల్ మంత్రి పి.నారాయణ స్పందించి రాష్ట్ర స్థాయి అధికారులతో విచారణ జరిపించగా, రాజకీయ కక్షతోనే భవనం కూల్చివేశారని, అధికారులు నిబంధనల ప్రకారం రెండుసార్లు నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదని, అర్ధరాత్రి సమయంలో భవనం కూల్చివేతలు చేపట్టకూడదని చట్టంలో ఉన్నప్పటికీ పట్టించుకోలేదని నివేదిక అందజేశారు. దీంతో అప్పటి గాజువాక డీసీపీ (ఇప్పుడు సీఆర్‌డీఏలో ఉన్నారు) నరేందర్‌రెడ్డి, అప్పటి గాజువాక టీపీఓ (ప్రస్తుతం ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో టీపీఓగా ఉన్నారు) వినయ్‌ప్రసాద్, అప్పటి టీపీఎస్ (ప్రస్తుతం పలాస టీపీఓగా ఉన్నారు) వరప్రసాద్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి చీఫ్ సిటీప్లానర్, ప్రస్తుతం రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ ఆర్జే విద్యుల్లత, అప్పటి సిటీ ప్లానర్, ప్రస్తుతం సీసీపీగా ఉన్న ప్రభాకరరావు, అప్పటి గాజువాక జోన్ కమిషనర్, ప్రస్తుతం సెక్రటేరియట్‌లో ఉన్న శ్రీధర్‌లకు షోకాజ్ నోటీసులు జారీచేసింది. భవనం కూల్చివేతలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందున ఎందుకు చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నట్టు సమాచారం. దీనిపై గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతోనే తన భవనం కూల్చివేశారని ఇప్పుడు రుజువైందన్నారు. తాను నిబంధనల ప్రకారమే భవనం నిర్మించానని, ఒకవేళ ఉల్లంఘనలు ఉంటే నోటీసులు ఇచ్చి తన సమాధానం తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలకు వెళ్లాలి తప్ప, అర్ధరాత్రివేళ నోటీసు అంటించి వెంటనే కూల్చివేయడం దారుణమన్నారు. రాజకీయ పలుకుబడికి తలొగ్గి అధికారులు నిబంధనలను పక్కనపెట్టేయడం సరికాదన్నారు. తాను పట్టుబడితే అప్పటి కమిషనర్ సృజనకు నోటీసులు ఇవ్వడంతోపాటు సీసీపీ విద్యుల్లతను కూడా సస్పెండ్ చేయవచ్చునన్నారు. ఇప్పటికైనా అధికారులు రాజకీయాలకతీతంగా పనిచేయాలని సూచించారు.

59 చోరీ కేసుల్లో 73 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

ముందస్తు చర్యలు తీసుకుంటూనే, మరోవైపు నమోదైన చోరీ కేసులను త్వరితగతిన ఛేదించేందుకు క్రైమ్ విభాగం అధికారులు, సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. గత నెల నగరంలో 84 చోరీలు జరిగితే వాటిలో 59 కేసులను ఛేదించామన్నారు. ఆయా కేసుల్లో నేరాలకు పాల్పడిన 73 మందిని అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశామన్నారు. అరెస్టు అయినవారి నుంచి 1,204 గ్రాముల బంగారం, 427.8 గ్రాముల వెండి, 5.67 లక్షల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, 430 సెల్‌ఫోన్‌లు, మూడు ల్యాప్‌టాప్‌లు, రెండు యాపిల్ ఐపాడ్స్, రూ.93 వేలు విలువైన రాగి వైరు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.1.06 కోట్లు ఉంటుందన్నారు. గత ఏడాది కాలంలో చోరీకి గురైన సెల్‌ఫోన్లలో 3,330 ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందజేశామన్నారు. అనంతరం చోరీ కేసుల్లో బాధితులకు వారు పోగొట్టుకున్న నగలు, సొత్తును సీపీ చేతులు మీదుగా అందజేశారు. చోరీకి గురైన సొత్తును నిందితుల నుంచి పోలీసులు రికవరీ చేసి తమకు అందజేయడం ఆనందంగా ఉందని బాధితులు సంతోషం వ్యక్తంచేశారు. సీపీతో పాటు పోలీస్ అధికారుల కృషిని అభినందించారు. అనంతరం నగర ఏఆర్ విభాగంలో బ్యాండ్‌పార్టీకి కొత్తగా కొనుగోలుచేసిన సంగీత పరికరాలను సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏసీపీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ బిల్లులకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

విశాఖపట్నం జిల్లాలో సుమారు రూ.20 కోట్ల సాధారణ నిధులతో 400 పనులు మంజూరుచేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులను సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేసినా మంజూరుకాలేదు. దీంతో జడ్పీ సమావేశాలు, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పదేపదే సభ్యులు ప్రస్తావిస్తూ వస్తున్నారు. బిల్లులు మంజూరుకాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మొత్తం 300 పనులకు సంబంధించి రూ.11.75 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాకు జమ చేశారు. గత నెలాఖరు వరకూ చేసిన పనులకు బిల్లులు మంజూరయ్యాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మంజూరుచేసిన మిగిలిన పనులను కూడా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదనలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జడ్పీ సాధారణ నిధులతో చేపట్టబోయే పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. గత ఏడాది బిల్లులు మంజూరుకావడంతో 2025-26 సంవత్సరానికి సంబంధించిన పనులపై ఈనెల 26వ తేదీన జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ప్రస్తావించాలని సభ్యులు భావిస్తున్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

ఆలోచిస్తున్నారు. రీజియన్‌లోని కొన్ని రూట్లలోని ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కూడా ఆర్డినరీ సర్వీస్‌లుగా మార్చేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లలో కూడా ఉచిత ప్రయాణానికి అనుమతిస్తే మరో 200 బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే రీజియన్‌లోని అన్ని రూట్లలో ఆక్యుపెన్సీ రేషియోను పరిశీలించి, అతి తక్కువ ఆక్యుపెన్సీ రేషియో ఉన్న రూట్లలోని బస్సులను ఎక్కువ ఆక్యుపెన్సీ రేషియో ఉన్న రూట్లలోకి మార్పుచేయడం, గ్యారేజీలో ఉన్న 30 స్పేర్ బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి 50 కొత్త బస్సులు కొద్దిరోజుల్లో వచ్చే అవకాశం ఉందని, అవి వచ్చిన తరువాత మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికారులు భావిస్తున్నారు.

పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దు

... 5వ పేజీ తరువాయి

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), కాకినాడ-విశాఖ మెము పాసింజర్ (17267), విశాఖ-కాకినాడ మెము పాసింజర్ (17268), ఈనెల 26, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875)లను రద్దు చేశామని పేర్కొన్నారు.

26న గాయనీ చిత్ర సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

సిరిపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ నేపథ్య గాయని చిత్ర పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 26న చిత్ర సినీ గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం మేయర్ ఛాంబర్‌లో మేయర్ పీలా శ్రీనివాసరావు ఆవిష్కరించారన్నారు. ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు పౌరగ్రంథాయలంలోని కీబోర్డు సోమేష్ సంగీత నిర్వహణలో జరిగే సంగీత విభావరిలో నేపథ్య గాయకురాలు చిత్ర పాడిన గీతాలు ఆలపిస్తారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, గాయని జీకే రాధకు విశాఖ చిత్ర బిరుదు ప్రదానం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో సంగీత ప్రియులు, కళా సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో గాయకుడు బి.మురళీధర్‌రావు పట్నాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల బాలాజీనగర్ 11కేవీ ఫీడర్ నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-3 ఎలక్ట్రికల్ (ఆపరేషన్స్) ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరికివేత పనులు చేపడుతున్నట్టు తెలిపారు ఈ సందర్భంగా పాండురంగపురం, నెహ్రూనగర్, దుర్గా బజార్, లక్ష్మీనగర్, ఎర్నిదుర్గానగర్, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్ ప్రాంతం, శివాజీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఏయూలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్

వెంకోజీపాలెం, జూలై 24(ఆంధ్రజ్యోతి) : ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో గురువారం కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని పిచ్చి మొక్కలతో నిండి ఉన్న విభాగంలోని రెండు గార్డెనులు పరిశుభ్రపరిచారు.అలాగే విభాగంలో చుట్టు పక్కల ఉన్న ప్రదేశాల్లో చెత్తను తీసివేసి ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, ఫ్యాకల్టీ చైర్మన్ ప్రొఫెసర్ ఉమాదేవి,ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 44, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 28, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 26, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 24, బంగాళ దుంపలు 17,అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42,అల్లం (పాతది) 60, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 28, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 42, కూరపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ఫలించిన భానునగర్ కాలనీవాసుల యత్నం

» ఎమ్మెల్యే వెలగపూడి చొరవతో కదిలిన ప్రభుత్వ సర్వే యంత్రాంగం
» జేసీ ఆదేశాలతో భానునగర్‌లో నష్ట పరిహారం భూముల సర్వే
» వారం రోజుల్లో 22- 1బి నుంచి తొలగిస్తామంటూ హామీ



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

వెంకోజీపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :గ్రేటర్ విశాఖ 16వ వార్డు భానునగర్‌లో కాలనీ వాసుల ప్రయత్నం ఫలించింది. వీరికి నష్ట పరిహారం కింద కేటాయించిన స్థలాలను 22-బి నుంచి తొలగించనున్నట్టు స్పష్టమైన అధికారుల నుంచి స్పష్టమైన హామీ లభించింది. ఆ స్థలాలన్నీ తమకు నష్టపరిహారంగా ఇచ్చినవేనని, ప్రభుత్వ స్థలాలు కాదని, వెంటనే తమ ప్రాంతాన్ని 22ఏ నుంచి తొలగించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిసి భానునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం సమర్పించగా, ఎమ్మెల్యే చొరవ తీసుకుని జేసీ కె.మయూర్ అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జేసీని కలవాలలంటూ అసోసియేషన్ సభ్యులకు ఎమ్మెల్యే వెలగపూడి సూచించారు. దీంతో అసోసియేషన్ సభ్యులు జేసీకి ఇచ్చిన వినతి మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన సర్వేయర్ దుర్గాప్రసాద్ తన బృందంతో భానునగర్‌కు వచ్చి నష్ట పరిహార భూములను సర్వే జరిపారు. ఇవన్నీ 22ఏలో లేవని, 22-1బిలో ఉన్నాయని, వారం రోజుల్లో నివేదికను సమర్పించి భూములన్నింటిని 22-1బి నుంచి తొలగించేందుకు చర్యలు చేపడతామని సభ్యులకు సర్వేయర్ దుర్గాప్రసాద్ హామీ ఇచ్చారు. ఇకపై సభ్యులు తమ భూములను యథేచ్ఛగా వినియోగించుకునేలా (రుణాలు, విక్రయాలకు) చూస్తామని చెప్పారు.

తమ విన్నపాన్ని వెనువెంటనే స్పందించి ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు, తక్షణమే స్పందించిన జేసీ కె.మయూర్ అశోక్‌కు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. స్థలాల వివరాలను సర్వేయర్‌లకు వివరించిన వారిలో అసోసియేషన్ సభ్యులు వంకా శివశంకర్ లాజరస్, ఒమ్మి నాయుడు, జి.వామనమూర్తి, పడాల గోవింద్, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా తదితరులు ఉన్నారు. .

జీవీఎంసీ ఆస్తులు అన్యాక్రాంతం కానివ్వొద్దు

» పట్టణ ప్రణాళిక అధికారులకు మేయర్ పీలా ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, అధికారులు

వెంకోజీపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ప్రభాకర్‌లతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కాపాడవలసిన బాధ్యత పట్టణ ప్రణాళిక అధికారులపై ఉందన్నారు. జీవీఎంసీ పరిధిలో జోనల్ వారీగా ఎన్ని ఖాళీ స్థలాలు, పార్కులు ఉన్నాయని, వాటిలో ఆక్రమణకు గురైన స్థలాలు, కోర్టు కేసులు, తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని జోన్లలో కలిపి 48 కోర్టు కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసులు ఉన్న స్థలాల డాక్యుమెంటేషన్ సరైన పద్ధతిలో కోర్టులో ప్రవేశ పెట్టడం ద్వారా ఆయా స్థలాలను మనం కాపాడుకోగలుగుతామని పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న ఖాళీ సలాల పరిరక్షణకు ఆయా జోనల్ అధికారులు బాధ్యత తీసుకుని పరిరక్షించాలన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నందున చాలావరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను వెంటనే తొలగించాలని మేయర్ ఆదేశించారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు పట్టణ ప్రణాళిక అధికారులు కృషి చేయాలని, ఖాళీ స్థలాలు, పార్కులు ఆక్రమణ జరగకుండా పరిరక్షించాలని, కోర్టు కేసులో ఉన్న స్థలాల వివరాలతో పాటు ఆక్రమణ జరిగిన ప్రాంతాల ఫోటోలు మేయర్‌తో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున ఫుట్‌పాత్‌లు రోడ్లను ఆక్రమించే వ్యాపారాలు నిర్వహించే వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలం ఆక్రమించి వ్యాపారాల నిర్వహిస్తున్న వారికి భారీ స్థాయిలో అపరాధ రుసుం వసూలు చేసి ఆయా దుకాణాలను తొలగించాలని, భవన నిర్మాణదారులు రోడ్డుపై నిర్మాణ సామగ్రి రాళ్లు, ఇసుక, సిమెంటు వంటివి వేసే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చాలా ఫిర్యాదులు వస్తున్నందున ప్రత్యేక దృష్టి సారించి వాటిని నియంత్రించాలని అధికారులకు సూచించారు. లే అవుట్‌లలో జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పార్కులు, జిమ్‌లు, ఆట స్థలాలు, టెన్నిస్ కోర్టు లాంటివి ఏర్పాటు చేసి ఫీజులు వసూలు చేసే వాటిని గుర్తించి, వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్లు మీనాకుమారి, ధనుంజయరెడ్డి, డీసీపీలు హరిదాసు, రామ్మోహన్, ఏసీపీలు, టీపీవోలు ఇతర పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

చెత్త తరలింపా? పారబోతా?

» రోడ్లపైనే పారబోస్తూ వెళుతున్న వాహనాలు
» తీవ్ర దుర్గంధం
» మరమ్మతు గురించి పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



చెత్తను రోడ్డుపై పారబోస్తూ వెళుతున్న వాహనం

మద్దిలపాలెం. జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం జాతీయ రహదారిలో చెత్తను తరలించే లారీల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పరిమితికి మించి చెత్తను లారీల్లో ఎత్తి తరలించడం, కొన్ని లారీల తొట్టెలు తుప్పు పట్టి రంధ్రాలు పడి ఉండడంతో చెత్తాచెదారం తీసుకొని వెళ్లేటప్పుడు దారి పొడవునా చెత్త జారి రోడ్డున పడిపోతోంది. దీంతో రోడ్లు చెత్త మయంగా అవుతున్నాయి. అంతేకాకుండా తీవ్ర దుర్వాసన వెలువడుతుండడంతో చాలా ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయరహదారిలో ఈ సమస్య నిత్యకృత్యమవుతోందని చెబుతున్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా చెత్తను తరలిస్తుండడం వల రోడ్డలపై రాకపోకలు సాగించే వారు కంపుతో ఇబ్బంది పడుతున్నారు. లారీల్లో చెత్త తరలించినప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకొని రోడ్లపై జారి పోకుండా జారకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నైపుణ్యాలు మెరుగుపరచుకుంటే ఘనమైన ఉపాధి అవకాశాలు

» రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏయూ సీఈవో రవిఈశ్వరరావు



మాట్లాడుతున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ ఏయూ హబ్ సీఈవో రవిఈశ్వరరావు

మద్దిలపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ నైపుణ్యాలు అభివృద్ధి పరచుకుంటే ఉపాధి రంగంలో మెరుగైన అవకాశాలు ఉన్నాయని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏయూ సీఈవో రవిఈశ్వరరావు పేర్కొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన స్టార్టప్ కార్యాకలాలపాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు స్టార్టప్‌లు స్థాపించడం కోసం సహాయం చేసేందుకు ఏయూలో తమ హబ్ ఏర్పాటు చేశామన్నారు. హబ్ ద్వారా ఉన్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకుని తమ స్టార్టప్‌లను రూపకల్పన చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో స్టార్టప్ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు.

ఏయూలోని హబ్ ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి అరుణకుమారి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి చాముండేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అకాడమిక్ కోఆర్డినేటర్ జి.రాజ్‌కుమార్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బకాయిల విడుదలకు పీడీఎస్‌వో డిమాండ్

తల్లికి వందనం, ఫీజు రీ-యింబర్స్‌మెంట్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు, విద్యార్థులు

సిరిపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న తల్లికి వందనం, ఫీజు రీ-యింబర్స్‌మెంట్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌వో) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం ప్రతి ఒక్క విద్యార్థికి ఫీజు రీ-యింబర్‌మెంట్స్ చెల్లిస్తామని, ఇష్టం వచ్చిన ప్రైవేటు కాలేజీలో ధనిక విద్యార్థులతో సమానంగా చదివే అవకాశాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పుడు వాటిని క్రమంగా ఎగ్గొట్టేస్తోందని మండిపడ్డారు. పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ ఫీజులను పూర్తిగా చెల్లించకపోయిన కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు పరీక్షల హాల్ టిక్కెట్లను ఇవ్వకపోవడం, టీసీ, స్టడీ సర్టిఫికెట్లను మంజూరు చేయకపోవడం వంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో సభ్యులు జానకి, ఢిల్లీ ప్రణయ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'పర్యావరణహిత రాఖీలతో పండుగ చేసుకుందాం'



పర్యావరణహిత రాఖీల నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది అందరూ పర్యావరణ రాఖీలతో ఈ ఏడాది రక్షా బంధన్ నిర్వహించుకుందామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ ఇంజనీర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ కళాశాలలో గురువారం గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ రాఖీలను తయారు చేశారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం ఆధ్వర్యంలో విత్తన రాఖీలను విద్యార్థులు తయారు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం రాఖీలను పర్యావరణ హితంగా అందరూ చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది రక్షా బంధన్‌ను వృక్షాబంధన్‌గా చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ప్లాస్టిక్‌తో తయారైన రాఖీలు దొరుకుతున్నాయని, వీటి వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. సమతా కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, వనమాలి సీటీజీ అడ్మిన్ మళ్ల సరిత, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ అనకాపల్లి పెసిలిటేటర్ కృష్ణకుమారి, గ్రీన్ క్లైమెట్ టీం కో-ఆర్డినేటర్ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలేవి?

» వెంకోజీపాలెం కూడలిలో నిత్యం కష్టాలే..!



వెంకోజీపాలెం జాతీయ రహదారిపై నో పార్కింగ్ జోన్‌లో నిలిపిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం కూడలిలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నా, నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూ పార్కు వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు హనుమంతువాక దాటిన తర్వాత వెంకోజీపాలెం వద్ద ఎంవీపీ వైపు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఎడమ వైపు పెట్రోలు బంకు మీదుగా చిన్న రహదారి ఏర్పాటు చేసినా, అటు వెళ్లడానికి వాహనాలకు చాలా ఇబ్బంది అవుతోంది. అక్కడ ఉన్న ఓ కార్పొరేట్ ఆస్పత్రికి సంబంధించిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి రోడ్డు పక్కన పార్కింగ్ చేయడం వల్ల ఎంవీపీ కాలనీ వైపు వెళ్లడానికి వీల్లేకుండా విపరీతమైన రద్దీ ఉంటోంది. దీని నియంత్రణకు నో పార్కింగ్ బోర్డు ఒకటి పెట్టేసి పోలీసులు చేతులు దులిపేసుకున్నారు. బోర్డు నామమాత్రంగానే ఉందనడానికి అక్కడ నిత్యం పార్కింగ్‌లో ఉన్న వాహనాలే నిదర్శనం. ముఖ్యంగా అక్కడ కొద్ది మేర అయినా రహదారిని విస్తరించాల్సిన ఆవశ్యకత ఉంది. పక్కన ఉన్న కొంత స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉంది. ఈ ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన రహదారి విస్తరించాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు. ఒకవేళ పెన్సింగ్ వేసినది ప్రైవేటు స్థలమే అయితే సదరు సంస్థతో అధికారులు సంప్రదించడం ద్వారా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

» **పోలీస్ బ్యాండ్‌కు నూతన పరికరాలు**



ఏఆర్ విభాగంలో బ్యాండ్‌పార్టీకి కొత్తగా కొనుగోలు చేసిన సంగీత పరికరాలను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

కాలబైరవ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం,జూలై 24(ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసియున్న కాలబైరవ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మలు భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, బోర యర్రాజీరెడ్డి, వేగి వెంకటరమణ ఇతర సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S. 26/2025

Between:
Baggam Kiran ...Plaintiff
And
Bodireddy Arun Kumar & others ...Defendants

SUMMONS

To,
D-7: Akaramani Raju,
S/o. Pydi Raju, R/at D.No 6-166/1,
G. Tallavalasa, Bheemunipatnam,
Visakhapatnam-531162

Take notice that the Plaintiff has filed the above suit against the defendants including you for the cancellation of the sale deed dated 20-05-2023 registered as Document No.3450/2023 in the office of The Joint Sub Registrar, Bheemunipatnam and for other reliefs and the suit stands posted to **14-08-2025** for your appearance. You are hereby summoned to appear before the above mentioned Court on **14-08-2025** at **10:30 A.M.** in person or through an Advocate duly instructed to answer all the material questions relating to the above matter or else the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
T. PARTHA SARADHI, Advocate
M.V.P. Colony, Visakhapatnam-17,
Cell: 9885787734

మహిళలను గౌరవంగా గమ్యం చేర్చాలి

» ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బస్సుల్లో ప్రయాణించే మహిళలను సురక్షితంగా, గౌరవంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు. వచ్చే నెల 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభం కానున్న దృష్ట్యా, మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, ఈసందర్భంగా రీజియన్‌లోని అన్ని డిపోల్లో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. సింహాచలం డిపోలో గురువారం ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు ప్రయాణించే అన్ని షెడ్యూల్స్‌లోను మహిళా కండక్టర్లను నియమించేందుకు ప్రాధాన్యమివ్వాలని డిపో మేనేజర్లకు సూచించారు. జీరో చార్జి టిక్కెట్టు ఇవ్వడం, ఇతరుల నుంచి నిర్దేశిత చార్జీలు వసూలు చేయడంలో కండక్టర్లు చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. డిపో మేనేజర్ల ఆధ్వర్యంలో మధురవాడ, విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, గాజువాక, స్టీల్‌సిటీ, డిపోల్లో శిక్షణా తరగతులు జరిగాయి.

రాష్ట్ర స్థాయి తైక్వాండోలో భాగ్యరాజుకు పతకం



విశాఖపట్నం, స్పోర్ట్సు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థి కె.భాగ్యరాజు పతకం సాధించాడు. రేపల్లెలో జరిగిన ఈ టోర్నీ పురుషుల 87 కిలోల విభాగంలో తలపడిన భాగ్యరాజు కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాల యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ మధుకుమార్, డాక్టర్ జీఎస్కే చక్రవర్తి, డాక్టర్ శ్రీకాంత్, వ్యాయామ విభాగ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి తదితరలు భాగ్యరాజును అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. సంగం ఆఫీస్, జగన్నాథపురం, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, దాలిరాజు సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీతమ్మధారలో...

సీతమ్మధార, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కొత్త విద్యుత్ లైన్లు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్ లే అవుట్, బాలయ్య శాస్త్రి లే అవుట్, సీతంపేట మెయిన్ రోడ్డు, సీతంపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపి వేయబడుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగస్వామ్యం కావాలి

మద్రిపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగస్వామ్యం కావాలని మాజీ కార్పొరేటర్ పొలమర శెట్టి నర్సకుమారి అన్నారు. గురువారం 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌లో యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య పరీక్షల అనంతరం పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. యూపీ హెచ్‌సీ వైద్యాధికారి ఎస్.అనూష, ల్యాబ్ టెక్నీషియన్ టీమధు, సూపర్‌వైజర్ సూర్యానారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలి

» ఆర్డీవో సంగీత్ మాధుర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సంగీత్ మాధుర్

సీతమ్మధార, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలో గల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, గ్రేడ్-1, గ్రేడ్-2 వీఆర్వోలతో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణకు సంబంధించిన అంశాలపై ఆర్డీవో కె.సంగీత మాధుర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జీవో నెంబర్ 30, జీవో నెంబర్ 296లపై భూ క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారించాలని సూచించారు. సమావేశంలో అర్బన్ తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్, డెప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథరావు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఇబ్రహీం, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

జాషువాకు ఘన నివాళి

» రెండు పుస్తకాలు ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య నరసింహారావు తదితరులు

సీతంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖలో గుర్రం జాషువా వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కొండపల్లి సుదర్శన్ రాజు రాసిన రెండు గ్రంథాలు 'దళిత కవుల మరణం కవిత స్మరణం', 'వచన కవిత్వం క్రైస్తవ ప్రభావం' పుస్తకాలను గురువారం ఆవిష్కరించారు.గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు 'దళిత కవుల మరణం కవిత స్మరణం' పుస్తకాన్ని ఆవిష్కించారు. జాషువా సాహితీపరంగా అత్యున్నత శిఖరాన్ని అధిరోహించారని కొనియాడారు. ఆయనకు నివాళులు అర్పించారు. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు 'వచన కవిత్వం.. క్రైస్తవ ప్రభావం' గ్రంథాన్ని ఆవిష్కరించారు. దళిత సాహిత్యంలో మైలురాయిగానే కాకుండా తెలుగు సాహిత్యంలోనే ప్రముఖంగా వెలుగొందుతున్నారని జాషువాను ప్రశంసించారు. ఆచార్య కొండపల్లి సుదర్శన రాజు మాట్లాడుతూ పాఠశాల ప్రాయంలోనే తనకు జాషువాను గురించి తెలుసుకోవడానికి వారు రాసిన 'గబ్బిలం' కావ్యం తమ గ్రామ వాసి అయిన అప్పటి మంత్రి కల్లూరు చంద్రమౌళి అంకితం తీసుకోవడమే కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు గజ్జా యోహాను బాబు, వెలమల సిమ్మన్న, సుదర్శన రాజు, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ గిరీశ్‌కుమార్, పలువురు సాహితీప్రియులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొడుపు పద్య శతకం ఆవిష్కరణ

సీతంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య పేరి సర్వేశ్వర అవధాని, ఆచార్య బీఎస్‌కే సుందరశివరావు రాసిన పొడుపు పద్య శతకం పుస్తకాన్ని ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సాహిత్య సురభి సంస్థ ఆధ్వర్యంలో గురువారు ఆవిష్కరించారు. సాహిత్య సురభి వ్యవస్థాపక అధ్యక్షుడు వృద్ధుల కల్యాణ రామారావు సభకు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం పొడుపు పద్య శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన సాహితీ విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు పుస్తకాన్ని సమీక్షిస్తూ పుస్తక రచయిత పద్య రచనలు చక్కగా తెలిపారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కేవీ రావు, ఓరుగంటి రాజరాజేశ్వరీ ప్రసాద్, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ముత్యాలమ్మ సారె ఊరేగింపు



అమ్మవారి సారె ఊరేగింపుగా తీసుకువెళ్తున్న పూజార్లు,భక్తులు

సీతమ్మధార, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలోని 24వ వార్డు పరిధిలో గల నక్కవానిపాలెంలో ముత్యాలమ్మ (ఏడు గుడులు) అమ్మవారి గ్రామ దేవత ఆషాడ మాస పూజ సారె ఊరేగింపు కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ కమిటీ పర్యవేక్షణలో గ్రామంలో గల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సారెతో పెద్ద సంఖ్యలో విచ్చేశారు. నక్కవానిపాలెంలో రామాలయం వద్ద గల దేవుడు ఇల్లు (పెద్దిళ్లు) నుంచి సారెతో ఊరేగింపుగా గ్రామంలో పలు వీధులో బాణసంచా కాల్చుతూ సారెను ఊరేగించారు. కార్యక్రమంలో పూజర్లు శ్రీకాంత్ భూలోక్‌తో పాటు పలువురు భక్తులు, కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి, గ్రామ కమిటీ ప్రతినిధులు కాటారాజు రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్యామలరావు, ధర్మాల గురుమూర్తి రెడ్డి, బోర శ్రీనివాసరావు, నక్క రమేష్ రెడ్డి, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలి : సీపీఐ



మెట్టు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కంచరపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడం, స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు తదితర నిర్ణయాలను తక్షణమే రద్దు చేయాలని కంచరపాలెం జోన్ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఉత్తర నియోజకవర్గం నాయకుల ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం మెట్టు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ .ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఎటువంటి చార్జీలు పెంచమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత పెంచడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.15486 కోట్లు అదనపు భారాన్ని మోపారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను నిలుపుదల చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు, కంచరపాలెం శాఖ కార్యదర్శి వాసుపల్లి మల్లయ్య, నెలవాడ అప్పన్న, ఆడారి ఆదినారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ

డాబాగార్డెన్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగాలకు సంబంధించి యువతకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కేంద్రం నిర్వాహకుడు డా. బి. గంగారావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 28 నుంచి అటవీ శాఖ ఉద్యోగాలకు, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు తరగతులు జరుగుతాయని చెప్పారు. వివరాలకు డాబాగార్డెన్స్ శిక్షణ కేంద్రంలో గాని లేదా ఫోన్ 93150 15015ను గాని సంప్రతించాలని ఆయన సూచించారు.

ప్రజా సహకారంతోనే నేరాల నియంత్రణ : సీఐ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కంచరపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కంచరపాలెం శాంతిభద్రతల సీఐ రవి కుమార్ అన్నారు. 47వ వార్డులోని తిక్కవానిపాలెం కాలనీలో స్థానికులకు గురువారం ఆయన నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు.మైనర్ల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత మత్తుకు బానిస అయితే జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు అప్పన్న, శంకర్, పరశయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



డ్యాన్స్ పోటీల విజేతలతో నిర్వాహకులు, డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

డాబాగార్డెన్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎన్‌సీఆర్‌సీ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ మారెళ్ల అన్నారు. గురువారం డాబా గార్డెన్స్‌లోని ప్రేమ సమాజం ఆడిటోరియంలో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్యాన్స్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించాలని చెప్పారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. నిర్వాహకులు ప్రసాద్ మారెళ్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వే ఫౌండేషన్ చైర్మన్ అంకయ్య, వీడీఏడీ రామారావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కూచిపూడి నాట్య అకాడమీ ఫౌండర్ వెంకటరమణ, కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ లలిత కుమార్ గుప్తా, సింగర్ సుప్రీంశేఖర్, నృత్య కళానికేతన్ మాస్టర్ గోపీనాథ్, ఎన్‌సీఆర్‌సీ స్టేట్ చైర్మన్ బళ్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి

అల్లిపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి పురస్కరించుకుని అల్లిపురంలోని శాఖా గ్రంథాలయంలో పలువురు గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈసందర్భంగా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి. కుమార్‌రాజు మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయ ఉద్యమంలో విశేషంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

రారెత్తిస్తున్న టమాటా ధర

» రోజురోజుకు ధర పెంపు
» రైతుబజార్‌లో కిలో రూ. 44
» బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 60 పైమాటే
» వినియోగదారుల గగ్గోలు



నరసింహనగర్ రైతుబజార్‌లో విక్రయిస్తున్న టమాటాలు

అక్కయ్యపాలెం,జూలై 24(ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల్లో ముఖ్యమైన టమాటా ధర రోజురోజుకు ఆకాశాన్నంటుతోంది. రైతుబజార్లలో వారం రోజుల క్రితం కిలో రూ.33, మంగళవారం రూ.39 ఉండగా, బుధవారం రూ. 44కి చేరింది. బహిరంగ మార్కెట్లలో కిలో టమాటా ధర రూ.60 వరకు పలుకుతోంది. వివిధ రకాల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుండగా, టమాటా ధర కొనుక్కోలేనంతగా ఎగబాకడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నరసింహనగర్ రైతుబజార్‌లో విక్రయాలు తగ్గిపోయాయి. ధర పెరగడంతో తక్కువమంది మాత్రమే వీటిని అమ్ముతున్నారు. టమాటా పండిస్తున్న ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పంటకు నష్టం సంభవించిందని, ఈ నేపథ్యంలో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికతో ధర ఇంకా పెరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. నగరంలోని టోకు మార్కెట్‌కు మదనపల్లి నుంచి టమాటా వస్తోంది.అక్కడ 25 కిలోల క్రేట్ ధర పెరగడంతో పాటు రవాణా ఖర్చులు కలిపితే మరింత భారమని వ్యాపారులు చెబుతున్నారు. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టమాటా పంపిణీకి చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆకస్మిక తనిఖీ

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫామ్‌లపై విస్తృతంగా పర్యటించి వెయిటింగ్ హాల్స్, వాటర్ బూత్స్, క్యాటరింగ్ స్టాల్స్ చెల్లింపు మరుగుదొడ్లు, పాదచారుల వంతెనలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు నిర్వహణతో పాటు పార్శిల్ కార్యాలయం కార్యకలాపాలు పరిశీలించారు. అనంతరం ప్రధాన స్టేషన్ ప్రవేశద్వారంతో పాటు జ్ఞానాపురం ప్రవేశద్వారం వైపు జరుగుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో కమర్షియల్, ఇంజనీరింగ్, ఆపరేటింగ్, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికాం తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం బొహ్రా, ఇతర అధికారులు

అశోక్‌ను కలిసిన టీడీపీ నాయకులు



అశోక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును విశాఖకు చెందిన టీడీపీ నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైల ముత్యాలనాయుడు, అనసూరి మధుసూదనరావు, వాసుపల్లి రాజు, గొలగాని సౌజన్య పాల్గొన్నారు.

'వార్డు అధ్యక్షుడిగా గణేశ్‌ను కొనసాగించాలి'

మహారాణిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 29వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా ఉరుకూటి గణేశ్‌ను కొనసాగించాలని వార్డులోని కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం వారు పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం పరిశీలకుడు ఎంవీవీ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ గణేశ్ కొన్నేళ్లుగా పార్టీకి సేవలందిస్తున్నారని, వార్డు అధ్యక్షుడిగా ఆయన్ను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డులోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

అక్కయ్యపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) సీతమ్మధార మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. గురువారం సాయంత్రం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బి. దుర్గాకుమారి, ప్రధాన కార్యదర్శిగా బలిరెడ్డి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కోరాడ సతీష్‌కుమార్, జి. చలపతిరావు, కె. పుష్పలత, కార్యదర్శులుగా కర్రి సత్యనారాయణ, కె. జయవర్ధన్, ఎం. సుజాత, కె. అప్పారావు, జిల్లా కౌన్సెలర్లుగా రాయుడు శ్రీనివాసరావు, అల్లంకి శ్రీనివాసరావు, వి. విష్ణుమూర్తినాయుడు తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

'కిడ్నీ బాధితులకు అండగా ఉంటాం'

పద్మనాభం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గురువారం ఆయన రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని భద్రయ్యపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాఠశాల వద్ద ప్రజలతో మాట్లాడారు. రోగుల ఆరోగ్య సమస్యలను విన్నారు. ఎప్పటి నుంచి సమస్య ఉందని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందించాలని అధికారులను ఆదేశించారు.సమస్యను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఫ్యూచర్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మళ్లీ భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) చేపట్టాలని నిర్ణయించింది. దీనికి రాష్ట్ర మంత్రి మండలి గురువారం పచ్చ జెండా ఊపింది. విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో అవసరమయ్యే భూముల కోసం ముందుగానే వీఎంఆర్‌డీఏ ప్రణాళిక రూపొందించుకుంది. ఇటు అనకాపల్లి, అటు విజయనగరం రెండు జిల్లాల వైపు నగరం విస్తరిస్తున్నందున జాతీయ రహదారికి సమీపంలో ఉన్న భూములను సమీకరించాలని భావిస్తోంది. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో మొత్తం 1,914 ఎకరాలు సమీకరించాలని నిర్ణయించినట్టు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ గురువారం 'ఆంధ్రజ్యోతి'కి గురువారం తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుందన్నారు. భూములకు సంబంధించిన రికార్డులన్నీ రెవెన్యూ శాఖ వద్దనే ఉన్నందున, వారినే భూ సమీకరణ చేయాలని కోరామన్నారు. అనకాపల్లిలోని చెర్లోపల్లి ఖండంలో 2007 నుంచి భూ సమీకరణ చేయాలని భావిస్తున్న 58.18 ఎకరాలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

ఐటీ హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.వేయి కోట్ల పెట్టుబడితో పది వేల మందికి ఉద్యోగాలు ఇవ్వనున్నారు. అగనంపూడి సమీపానున్న ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో 5 స్టార్ హోటల్ ఏర్పాటుకు లాన్సమ్ లీజర్స్ సంస్థ ఒప్పందం చేసింది. అదేవిధంగా కోల్‌కతాకు చెందిన ఐటీసీ కంపెనీ కూడా విశాఖలో 5 స్టార్ హోటల్ ఏర్పాటుకు ముందుకురాగా దానికి కూడా తగిన భూములు ఇవ్వడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

రత్నాచల్ సహా పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దు

... 5వ పేజీ తరువాయి

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), కాకినాడ-విశాఖ మెము పాసింజర్ (17267), విశాఖ-కాకినాడ మెము పాసింజర్ (17268), ఈనెల 26, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875)లను రద్దు చేశామని పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

ఆలోచిస్తున్నారు. రీజియన్‌లోని కొన్ని రూట్లలోని ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కూడా ఆర్డినరీ సర్వీస్‌లుగా మార్చేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లలో కూడా ఉచిత ప్రయాణానికి అనుమతిస్తే మరో 200 బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే రీజియన్‌లోని అన్ని రూట్లలో ఆక్యుపెన్సీ రేషియోను పరిశీలించి, అతి తక్కువ ఆక్యుపెన్సీ రేషియో ఉన్న రూట్లలోని బస్సులను ఎక్కువ ఆక్యుపెన్సీ రేషియో ఉన్న రూట్లలోకి మార్పుచేయడం, గ్యారేజీలో ఉన్న 30 స్పేర్ బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి 50 కొత్త బస్సులు కొద్దిరోజుల్లో వచ్చే అవకాశం ఉందని, అవి వచ్చిన తరువాత మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికారులు భావిస్తున్నారు.

59 చోరీ కేసుల్లో 73 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

ముందస్తు చర్యలు తీసుకుంటూనే, మరోవైపు నమోదైన చోరీ కేసులను త్వరితగతిన ఛేదించేందుకు క్రైమ్ విభాగం అధికారులు, సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. గత నెల నగరంలో 84 చోరీలు జరిగితే వాటిలో 59 కేసులను ఛేదించామన్నారు. ఆయా కేసుల్లో నేరాలకు పాల్పడిన 73 మందిని అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశామన్నారు. అరెస్టు అయినవారి నుంచి 1,204 గ్రాముల బంగారం, 427.8 గ్రాముల వెండి, 5.67 లక్షల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, 430 సెల్‌ఫోన్‌లు, మూడు ల్యాప్‌టాప్‌లు, రెండు యాపిల్ ఐపాడ్స్, రూ.93 వేలు విలువైన రాగివైరు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.1.06 కోట్లు ఉంటుందన్నారు. గత ఏడాది కాలంలో చోరీకి గురైన సెల్‌ఫోన్లలో 3,330 ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందజేశామన్నారు. అనంతరం చోరీ కేసుల్లో బాధితులకు వారు పోగొట్టుకున్న నగలు, సొత్తును సీపీ చేతులు మీదుగా అందజేశారు. చోరీకి గురైన సొత్తును నిందితుల నుంచి పోలీసులు రికవరీ చేసి తమకు అందజేయడం ఆనందంగా ఉందని బాధితులు సంతోషం వ్యక్తంచేశారు. సీపీతోపాటు పోలీస్ అధికారుల కృషిని అభినందించారు. అనంతరం నగర ఏఆర్ విభాగంలో బ్యాండ్‌పార్టీకి కొత్తగా కొనుగోలుచేసిన సంగీత పరికరాలను సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏసీపీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ బిల్లులకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

విశాఖపట్నం జిల్లాలో సుమారు రూ.20 కోట్ల సాధారణ నిధులతో 400 పనులు మంజూరుచేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌కు అప్‌లోడ్ చేసినా మంజూరుకాలేదు. దీంతో జడ్పీ సమావేశాలు, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పదేపదే సభ్యులు ప్రస్తావిస్తూ వస్తున్నారు. బిల్లులు మంజూరుకాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మొత్తం 300 పనులకు సంబంధించి రూ.11.75 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాకు జమ చేశారు. గత నెలాఖరు వరకూ చేసిన పనులకు బిల్లులు మంజూరయ్యాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మంజూరుచేసిన మిగిలిన పనులను కూడా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదనలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జడ్పీ సాధారణ నిధులతో చేపట్టబోయే పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. గత ఏడాది బిల్లులు మంజూరుకావడంతో 2025-26 సంవత్సరానికి సంబంధించిన పనులపై ఈనెల 26వ తేదీన జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ప్రస్తావించాలని సభ్యులు భావిస్తున్నారు.

పల్లా భవనం కూల్చివేత వ్యవహారం...

ముగ్గురిపై వేటు

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోయారు. తన భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా, రాజకీయ పలుకుబడికి తలొగ్గి కూల్చివేశారంటూ అప్పటి ప్రభుత్వానికి పల్లా శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని పల్లా కోరారు. దీంతో మునిసిపల్ మంత్రి పి.నారాయణ స్పందించి రాష్ట్రస్థాయి అధికారులతో విచారణ జరిపించగా, రాజకీయ కక్షతోనే భవనం కూల్చివేశారని, అధికారులు నిబంధనల ప్రకారం రెండుసార్లు నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదని, అర్ధరాత్రి సమయంలో భవనం కూల్చివేతలు చేపట్టకూడదని చట్టంలో ఉన్నప్పటికీ పట్టించుకోలేదని నివేదిక అందజేశారు. దీంతో అప్పటి గాజువాక డీసీపీ (ఇప్పుడు సీఆర్‌డీఏలో ఉన్నారు) నరేందర్‌రెడ్డి, అప్పటి గాజువాక టీపీఓ (ప్రస్తుతం ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో టీపీఓగా ఉన్నారు) వినయ్‌ప్రసాద్, అప్పటి టీపీఎస్ (ప్రస్తుతం పలాస టీపీఓగా ఉన్నారు) వరప్రసాద్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి చీఫ్ సిటీప్లానర్, ప్రస్తుతం రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ ఆర్జే విద్యుల్లత, అప్పటి సిటీ ప్లానర్, ప్రస్తుతం సీసీపీగా ఉన్న ప్రభాకరరావు, అప్పటి గాజువాక జోన్ కమిషనర్, ప్రస్తుతం సెక్రటేరియట్‌లో ఉన్న శ్రీధర్‌లకు షోకాజ్ నోటీసులు జారీచేసింది. భవనం కూల్చివేతలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందున ఎందుకు చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నట్టు సమాచారం. దీనిపై గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతోనే తన భవనం కూల్చివేశారని ఇప్పుడు రుజువైందన్నారు. తాను నిబంధనల ప్రకారమే భవనం నిర్మించానని, ఒకవేళ ఉల్లంఘనలు ఉంటే నోటీసులు ఇచ్చి తన సమాధానం తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలకు వెళ్లాలి తప్ప, అర్ధరాత్రివేళ నోటీసు అంటించి వెంటనే కూల్చివేయడం దారుణమన్నారు. రాజకీయ పలుకుబడికి తలొగ్గి అధికారులు నిబంధనలను పక్కనపెట్టేయడం సరికాదన్నారు. తాను పట్టుబడితే అప్పటి కమిషనర్ సృజనకు నోటీసులు ఇవ్వడంతోపాటు సీసీపీ విద్యుల్లతను కూడా సస్పెండ్ చేయవచ్చునన్నారు. ఇప్పటికైనా అధికారులు రాజకీయాలకతీతంగా పనిచేయాలని సూచించారు.

26న గాయనీ చిత్ర సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

సిరిపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ నేపథ్య గాయని చిత్ర పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 26న చిత్ర సినీ గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం మేయర్ ఛాంబర్‌లో మేయర్ పీలా శ్రీనివాసరావు ఆవిష్కరించారన్నారు. ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు పౌరగ్రంథాయలంలోని కీబోర్డు సోమేష్ సంగీత నిర్వహణలో జరిగే సంగీత విభావరిలో నేపథ్య గాయకురాలు చిత్ర పాడిన గీతాలు ఆలపిస్తారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, గాయని జీకే రాధకు విశాఖ చిత్ర బిరుదు ప్రదానం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో సంగీత ప్రియులు, కళా సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో గాయకుడు బి.మురళీధర్‌రావు పట్నాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల బాలాజీనగర్ 11కేవీ ఫీడర్ నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-3 ఎలక్ట్రికల్ (ఆపరేషన్స్) ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరికివేత పనులు చేపడుతున్నట్టు తెలిపారు ఈ సందర్భంగా పాండురంగాపురం, నెహ్రూనగర్, దుర్గా బజార్, లక్ష్మీనగర్, ఎర్నిదుర్గానగర్, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్ ప్రాంతం, శివాజీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఏయూలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్

వెంకోజీపాలెం, జూలై 24(ఆంధ్రజ్యోతి) : ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో గురువారం కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని పిచ్చి మొక్కలతో నిండి ఉన్న విభాగంలోని రెండు గార్డెనులు పరిశుభ్రపరిచారు.అలాగే విభాగంలో చుట్టు పక్కల ఉన్న ప్రదేశాల్లో చెత్తను తీసివేసి ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, ఫ్యాకల్టీ చైర్మన్ ప్రొఫెసర్ ఉమాదేవి,ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 44, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 28, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 26, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 24, బంగాళ దుంపలు 17,అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42,అల్లం (పాతది) 60, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 28, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 42, కూరపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ఫలించిన భానునగర్ కాలనీవాసుల యత్నం

- ఎమ్మెల్యే వెలగపూడి చొరవతో కదిలిన ప్రభుత్వ సర్వే యంత్రాంగం
- జేసీ ఆదేశాలతో భానునగర్‌లో నష్ట పరిహారం భూముల సర్వే
- వారం రోజుల్లో 22- 1బి నుంచి తొలగిస్తామంటూ హామీ



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

వెంకోజీపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :గ్రేటర్ విశాఖ 16వ వార్డు భానునగర్‌లో కాలనీ వాసుల ప్రయత్నం ఫలించింది. వీరికి నష్ట పరిహారం కింద కేటాయించిన స్థలాలను 22-బి నుంచి తొలగించనున్నట్టు స్పష్టమైన అధికారుల నుంచి స్పష్టమైన హామీ లభించింది. ఆ స్థలాలన్నీ తమకు నష్టపరిహారంగా ఇచ్చినవేనని, ప్రభుత్వ స్థలాలు కాదని, వెంటనే తమ ప్రాంతాన్ని 22ఏ నుంచి తొలగించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిసి భానునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం సమర్పించగా, ఎమ్మెల్యే చొరవ తీసుకుని జేసీ కె.మయూర్ అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జేసీని కలవాలలంటూ అసోసియేషన్ సభ్యులకు ఎమ్మెల్యే వెలగపూడి సూచించారు. దీంతో అసోసియేషన్ సభ్యులు జేసీకి ఇచ్చిన వినతి మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన సర్వేయర్ దుర్గాప్రసాద్ తన బృందంతో భానునగర్‌కు వచ్చి నష్ట పరిహార భూములను సర్వే జరిపారు. ఇవ్వన్నీ 22ఏలో లేవని, 22-1బిలో ఉన్నాయని, వారం రోజుల్లో నివేదికను సమర్పించి భూములన్నింటిని 22-1బి నుంచి తొలగించేందుకు చర్యలు చేపడతామని సభ్యులకు సర్వేయర్ దుర్గాప్రసాద్ హామీ ఇచ్చారు. ఇకపై సభ్యులు తమ భూములను యథేచ్ఛగా వినియోగించుకునేలా (రుణాలు, విక్రయాలకు) చూస్తామని చెప్పారు.

తమ విన్నపాన్ని వెనువెంటనే స్పందించి ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు, తక్షణమే స్పందించిన జేసీ కె.మయూర్ అశోక్‌కు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. స్థలాల వివరాలను సర్వేయర్‌లకు వివరించిన వారిలో అసోసియేషన్ సభ్యులు వంకా శివశంకర్ లాజరస్, ఒమ్మి నాయుడు, జి.వామనమూర్తి, పడాల గోవింద్, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా తదితరులు ఉన్నారు. .

జీవీఎంసీ ఆస్తులు అన్యాక్రాంతం కానివ్వొద్దు

- పట్టణ ప్రణాళిక అధికారులకు మేయర్ పీలా ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, అధికారులు

వెంకోజీపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ప్రభాకర్‌లతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కాపాడవలసిన బాధ్యత పట్టణ ప్రణాళిక అధికారులపై ఉందన్నారు. జీవీఎంసీ పరిధిలో జోనల్ వారీగా ఎన్ని ఖాళీ స్థలాలు, పార్కులు ఉన్నాయని, వాటిలో ఆక్రమణకు గురైన స్థలాలు, కోర్టు కేసులు, తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని జోన్లలో కలిపి 48 కోర్టు కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసులు ఉన్న స్థలాల డాక్యుమెంటేషన్ సరైన పద్ధతిలో కోర్టులో ప్రవేశ పెట్టడం ద్వారా ఆయా స్థలాలను మనం కాపాడుకోగలుగుతామని పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న ఖాళీ సలాల పరిరక్షణకు ఆయా జోనల్ అధికారులు బాధ్యత తీసుకుని పరిరక్షించాలన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నందున చాలావరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను వెంటనే తొలగించాలని మేయర్ ఆదేశించారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు పట్టణ ప్రణాళిక అధికారులు కృషి చేయాలని, ఖాళీ స్థలాలు, పార్కులు ఆక్రమణ జరగకుండా పరిరక్షించాలని, కోర్టు కేసులో ఉన్న స్థలాల వివరాలతో పాటు ఆక్రమణ జరిగిన ప్రాంతాల ఫోటోలు మేయర్‌తో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున ఫుట్‌పాత్‌లు రోడ్లను ఆక్రమించే వ్యాపారాలు నిర్వహించే వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలం ఆక్రమించి వ్యాపారాల నిర్వహిస్తున్న వారికి భారీ స్థాయిలో అపరాధ రుసుం వసూలు చేసి ఆయా దుకాణాలను తొలగించాలని, భవన నిర్మాణదారులు రోడ్డుపై నిర్మాణ సామగ్రి రాళ్లు, ఇసుక, సిమెంటు వంటివి వేసే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చాలా ఫిర్యాదులు వస్తున్నందున ప్రత్యేక దృష్టి సారించి వాటిని నియంత్రించాలని అధికారులకు సూచించారు. లే అవుట్‌లలో జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పార్కులు, జిమ్‌లు, ఆట స్థలాలు, టెన్నిస్ కోర్టు లాంటివి ఏర్పాటు చేసి ఫీజులు వసూలు చేసే వాటిని గుర్తించి, వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్లు మీనాకుమారి, ధనుంజయరెడ్డి, డీసీపీలు హరిదాసు, రామ్మోహన్, ఏసీపీలు, టీపీవోలు ఇతర పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

చెత్త తరలింపా? పారబోతా?

- రోడ్లపైనే పారబోస్తూ వెళుతున్న వాహనాలు
- తీవ్ర దుర్గంధం
- మరమ్మతు గురించి పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం. జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం జాతీయ రహదారిలో చెత్తను తరలించే లారీల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పరిమితికి మించి చెత్తను లారీల్లో ఎత్తి తరలించడం, కొన్ని లారీల తొట్టెలు తుప్పు పట్టి రంధ్రాలు పడి ఉండడంతో చెత్తాచెదారం తీసుకొని వెళ్లేటప్పుడు దారి పొడవునా చెత్త జారి రోడ్డున పడిపోతోంది. దీంతో రోడ్లు చెత్తమయంగా అవుతున్నాయి. అంతేకాకుండా తీవ్ర దుర్వాసన వెలువడుతుండడంతో చాలా ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయరహదారిలో ఈ సమస్య నిత్యకృత్యమవుతోందని చెబుతున్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా చెత్తను తరలిస్తుండడం వల రోడ్డలపై రాకపోకలు సాగించే వారు కంపుతో ఇబ్బంది పడుతున్నారు. లారీల్లో చెత్త తరలించినప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకొని రోడ్లపై జారి పోకుండా జారకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చెత్తను రోడ్డుపై పారబోస్తూ వెళుతున్న వాహనం

నైపుణ్యాలు మెరుగుపరచుకుంటే ఘనమైన ఉపాధి అవకాశాలు

- రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏయూ సీఈవో రవిఈశ్వరరావు



మాట్లాడుతున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ ఏయూ హబ్ సీఈవో రవిఈశ్వరరావు

మద్దిలపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ నైపుణ్యాలు అభివృద్ధి పరచుకుంటే ఉపాధి రంగంలో మెరుగైన అవకాశాలు ఉన్నాయని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏయూ సీఈవో రవిఈశ్వరరావు పేర్కొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన స్టార్టప్ కార్యాకలాపాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు స్టార్టప్‌లు స్థాపించడం కోసం సహాయం చేసేందుకు ఏయూలో తమ హబ్ ఏర్పాటు చేశామన్నారు. హబ్ ద్వారా ఉన్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకుని తమ స్టార్టప్‌లను రూపకల్పన చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో స్టార్టప్ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు.

ఏయూలోని హబ్ ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి అరుణకుమారి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి చాముండేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అకాడమిక్ కోఆర్డినేటర్ జి.రాజ్‌కుమార్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బకాయిల విడుదలకు పీడీఎస్‌వో డిమాండ్

తల్లికి వందనం, ఫీజు రీ-యింబర్స్‌మెంట్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం నిరసన

సిరిపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న తల్లికి వందనం, ఫీజు రీ-యింబర్స్‌మెంట్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌వో) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం ప్రతి ఒక్క విద్యార్థికి ఫీజు రీ-యింబర్‌మెంట్స్ చెల్లిస్తామని, ఇష్టం వచ్చిన ప్రైవేటు కాలేజీలో ధనిక విద్యార్థులతో సమానంగా చదివే అవకాశాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పుడు వాటిని క్రమంగా ఎగ్గొట్టేస్తోందని మండిపడ్డారు. పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ ఫీజులను పూర్తిగా చెల్లించకపోయిన కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు పరీక్షల హాల్ టిక్కెట్లను ఇవ్వకపోవడం, టీసీ, స్టడీ సర్టిఫికెట్లను మంజూరు చేయకపోవడం వంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో సభ్యులు జానకి, ఢిల్లీ ప్రణయ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు, విద్యార్థులు

‘పర్యావరణహిత రాఖీలతో పండుగ చేసుకుందాం’

ఎంవీపీ కాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది అందరూ పర్యావరణ రాఖీలతో ఈ ఏడాది రక్షా బంధన్ నిర్వహించుకుందామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ ఇంజనీర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ కళాశాలలో గురువారం గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ రాఖీలను తయారు చేశారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం ఆధ్వర్యంలో విత్తన రాఖీలను విద్యార్థులు తయారు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం రాఖీలను పర్యావరణ హితంగా అందరూ చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది రక్షా బంధన్‌ను వృక్షాబంధన్‌గా చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ప్లాస్టిక్‌తో తయారైన రాఖీలు దొరుకుతున్నాయని, వీటి వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. సమతా కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, వనమాలి సీటీజీ అడ్మిన్ మళ్ల సరిత, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ అనకాపల్లి ఫెసిలిటేటర్ కృష్ణకుమారి, గ్రీన్ క్లైమెట్ టీం కో-ఆర్డినేటర్ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



పర్యావరణహిత రాఖీల నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలేవి?

- వెంకోజీపాలెం కూడలిలో నిత్యం కష్టాలే..!



వెంకోజీపాలెం జాతీయ రహదారిపై నో పార్కింగ్ జోన్‌లో నిలిపిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం కూడలిలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నా, నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూ పార్కు వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు హనుమంతువాక దాటిన తర్వాత వెంకోజీపాలెం వద్ద ఎంవీపీ వైపు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఎడమ వైపు పెట్రోలు బంకు మీదుగా చిన్న రహదారి ఏర్పాటు చేసినా, అటు వెళ్లడానికి వాహనాలకు చాలా ఇబ్బంది అవుతోంది. అక్కడ ఉన్న ఓ కార్పొరేట్ ఆస్పత్రికి సంబంధించిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి రోడ్డు పక్కన పార్కింగ్ చేయడం వల్ల ఎంవీపీ కాలనీ వైపు వెళ్లడానికి వీల్లేకుండా విపరీతమైన రద్దీ ఉంటోంది. దీని నియంత్రణకు నో పార్కింగ్ బోర్డు ఒకటి పెట్టేసి పోలీసులు చేతులు దులిపేసుకున్నారు. బోర్డు నామమాత్రంగానే ఉందనడానికి అక్కడ నిత్యం పార్కింగ్‌లో ఉన్న వాహనాలే నిదర్శనం. ముఖ్యంగా అక్కడ కొద్ది మేర అయినా రహదారిని విస్తరించాల్సిన ఆవశ్యకత ఉంది. పక్కన ఉన్న కొంత స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉంది. ఈ ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన రహదారి విస్తరించాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు. ఒకవేళ ఫెన్సింగ్ వేసినది ప్రైవేటు స్థలమే అయితే సదరు సంస్థతో అధికారులు సంప్రదించడం ద్వారా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

కాలబైరవ స్వామికి ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం,జూలై 24(ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసియున్న కాలబైరవ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మలు భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, బోర యర్రాజీరెడ్డి, వేగి వెంకటరమణ ఇతర సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మహిళలను గౌరవంగా గమ్యం చేర్చాలి

- ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బస్సుల్లో ప్రయాణించే మహిళలను సురక్షితంగా, గౌరవంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు. వచ్చే నెల 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభం కానున్న దృష్ట్యా, మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, ఈసందర్భంగా రీజియన్‌లోని అన్ని డిపోల్లో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. సింహాచలం డిపోలో గురువారం ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు ప్రయాణించే అన్ని షెడ్యూల్స్‌లోను మహిళా కండక్టర్లను నియమించేందుకు ప్రాధాన్యమివ్వాలని డిపో మేనేజర్లకు సూచించారు. జీరో చార్జి టిక్కెట్లు ఇవ్వడం, ఇతరుల నుంచి నిర్దేశిత చార్జీలు వసూలు చేయడంలో కండక్టర్లు చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. డిపో మేనేజర్ల ఆధ్వర్యంలో మధురవాడ, విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, గాజువాక, స్టీల్‌సిటీ, డిపోల్లో శిక్షణా తరగతులు జరిగాయి.

- పోలీస్ బ్యాండ్‌కు నూతన పరికరాలు



ఏఆర్ విభాగంలో బ్యాండ్‌పార్టీకి కొత్తగా కొనుగోలు చేసిన సంగీత పరికరాలను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర స్థాయి తైక్వాండోలో భాగ్యరాజుకు పతకం



విశాఖపట్నం, స్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థి కె.భాగ్యరాజు పతకం సాధించాడు. రేపల్లెలో జరిగిన ఈ టోర్నీ పురుషుల 87 కిలోల విభాగంలో తలపడిన భాగ్యరాజు కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాల యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ మధుకుమార్, డాక్టర్ జీఎస్కే చక్రవర్తి, డాక్టర్ శ్రీకాంత్, వ్యాయామ విభాగ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి తదితరలు భాగ్యరాజును అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లుఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. సంగం ఆఫీస్, జగన్నాథపురం, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, దాలిరాజు సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీతమ్మధారలో...

సీతమ్మధార, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కొత్త విద్యుత్ లైన్లు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టేన్స్ లే అవుట్, బాలయ్య శాస్త్రి లే అవుట్, సీతంపేట మెయిన్ రోడ్డు, సీతంపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపి వేయబడుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగస్వామ్యం కావాలి

మర్రిపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగస్వామ్యం కావాలని మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి అన్నారు. గురువారం 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌లో యూపీహెచ్‌సీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య పరీక్షల అనంతరం పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. యూపీ హెచ్‌సీ వైద్యాధికారి ఎస్.అనూష, ల్యాబ్ టెక్నీషియన్ టిమధు, సూపర్‌వైజర్ సూర్యానారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలి

» ఆర్డీవో సంగీత్ మాధుర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సంగీత్ మాధుర్

సీతమ్మధార, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలో గల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, గ్రేడ్-1, గ్రేడ్-2 వీఆర్వోలతో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణకు సంబంధించిన అంశాలపై ఆర్డీవో కె.సంగీత మాధుర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జీవో నెంబర్ 30, జీవో నెంబర్ 296లపై భూ క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారించాలని సూచించారు. సమావేశంలో అర్బన్ తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథరావు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఇబ్రహీం, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

జాషువాకు ఘన నివాళి

» రెండు పుస్తకాలు ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య నరసింహారావు తదితరులు

సీతంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖలో గుర్రం జాషువా వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కొండపల్లి సుదర్శన్ రాజు రాసిన రెండు గ్రంథాలు 'దళిత కవుల మరణం కవిత స్మరణం', 'వచన కవిత్వం క్రైస్తవ ప్రభావం' పుస్తకాలను గురువారం ఆవిష్కరించారు.గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు 'దళిత కవుల మరణం కవిత స్మరణం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. జాషువా సాహితీపరంగా అత్యున్నత శిఖరాన్ని అధిరోహించారని కొనియాడారు. ఆయనకు నివాళులు అర్పించారు. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు 'వచన కవిత్వం.. క్రైస్తవ ప్రభావం' గ్రంథాన్ని ఆవిష్కరించారు. దళిత సాహిత్యంలో మైలురాయిగానే కాకుండా తెలుగు సాహిత్యంలోనే ప్రముఖంగా వెలుగొందుతున్నారని జాషువాను ప్రశంసించారు. ఆచార్య కొండపల్లి సుదర్శన రాజు మాట్లాడుతూ పాఠశాల ప్రాయంలోనే తనకు జాషువాను గురించి తెలుసుకోవడానికి వారు రాసిన 'గబ్బిలం' కావ్యం తమ గ్రామ వాసి అయిన అప్పటి మంత్రి కల్లూరు చంద్రమౌళి అంకితం తీసుకోవడమే కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు గజ్జా యోహాను బాబు, వెలమల సిమ్మన్న, సుదర్శన రాజు, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ గిరీష్‌కుమార్, పలువురు సాహితీప్రియులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొడుపు పద్య శతకం ఆవిష్కరణ

సీతంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య పేరి సర్వేశ్వర అవధాని, ఆచార్య బీఎస్‌కే సుందరశివరావు రాసిన పొడుపు పద్య శతకం పుస్తకాన్ని ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సాహిత్య సురభి సంస్థ ఆధ్వర్యంలో గురువారు ఆవిష్కరించారు. సాహిత్య సురభి వ్యవస్థాపక అధ్యక్షుడు వృద్ధుల కల్యాణ రామారావు సభకు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం పొడుపు పద్య శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన సాహితీ విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు పుస్తకాన్ని సమీక్షిస్తూ పుస్తక రచయిత పద్య రచనలు చక్కగా తెలిపారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కేవీ రావు, ఓరుగంటి రాజరాజేశ్వరీ ప్రసాద్, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ముత్యాలమ్మ సారె ఊరేగింపు



అమ్మవారి సారె ఊరేగింపుగా తీసుకువెళ్తున్న పూజర్లు,భక్తులు

సీతమ్మధార, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలోని 24వ వార్డు పరిధిలో గల నక్కవానిపాలెంలో ముత్యాలమ్మ (ఏడు గుడులు) అమ్మవారి గ్రామ దేవత ఆషాడ మాస పూజ సారె ఊరేగింపు కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ కమిటీ పర్యవేక్షణలో గ్రామంలో గల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సారెతో పెద్ద సంఖ్యలో విచ్చేశారు. నక్కవానిపాలెంలో రామాలయం వద్ద గల దేవుడు ఇల్లు (పెద్దిళ్లు) నుంచి సారెతో ఊరేగింపుగా గ్రామంలో పలు వీధులో బాణసంచా కాల్చుతూ సారెను ఊరేగించారు. కార్యక్రమంలో పూజర్లు శ్రీకాంత్ భూలోక్‌తో పాటు పలువురు భక్తులు, కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి, గ్రామ కమిటీ ప్రతినిధులు కాటారాజు రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్యామలరావు, ధర్మాల గురుమూర్తి రెడ్డి, బోర శ్రీనివాసరావు, నక్క రమేష్ రెడ్డి, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలి : సీపీఐ



మెట్టు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కంచరపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడం, స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు తదితర నిర్ణయాలను తక్షణమే రద్దు చేయాలని కంచరపాలెం జోన్ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఉత్తర నియోజకవర్గం నాయకుల ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం మెట్టు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ .ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఎటువంటి చార్జీలు పెంచమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత పెంచడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.15486 కోట్లు అదనపు భారాన్ని మోపారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను నిలుపుదల చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు, కంచరపాలెం శాఖ కార్యదర్శి వాసుపల్లి మల్లయ్య, నెలవాడ అప్పన్న, ఆడారి ఆదినారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మళ్లీ భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) చేపట్టాలని నిర్ణయించింది. దీనికి రాష్ట్ర మంత్రి మండలి గురువారం పచ్చ జెండా ఊపింది. విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో అవసరమయ్యే భూముల కోసం ముందుగానే వీఎంఆర్‌డీఏ ప్రణాళిక రూపొందించుకుంది. ఇటు అనకాపల్లి, అటు విజయనగరం రెండు జిల్లాల వైపు నగరం విస్తరిస్తున్నందున జాతీయ రహదారికి సమీపంలో ఉన్న భూములను సమీకరించాలని భావిస్తోంది. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో మొత్తం 1,914 ఎకరాలు సమీకరించాలని నిర్ణయించినట్టు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ గురువారం 'ఆంధ్రజ్యోతి'కి గురువారం తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుందన్నారు. భూములకు సంబంధించిన రికార్డులన్నీ రెవెన్యూ శాఖ వద్దనే ఉన్నందున, వారినే భూ సమీకరణ చేయాలని కోరామన్నారు. అనకాపల్లిలోని చెర్లోపల్లి ఖండంలో 2007 నుంచి భూ సమీకరణ చేయాలని భావిస్తున్న 58.18 ఎకరాలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

ఐటీ హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.వేయి కోట్ల పెట్టుబడితో పది వేల మందికి ఉద్యోగాలు ఇవ్వనున్నారు. అగనంపూడి సమీపానున్న ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో 5 స్టార్ హోటల్ ఏర్పాటుకు లాన్సమ్ లీజర్స్ సంస్థ ఒప్పందం చేసింది. అదేవిధంగా కోల్‌కతాకు చెందిన ఐటీసీ కంపెనీ కూడా విశాఖలో 5 స్టార్ హోటల్ ఏర్పాటుకు ముందుకురాగా దానికి కూడా తగిన భూములు ఇవ్వడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

రత్నాచల్ సహా పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దు

... 5వ పేజీ తరువాయి

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), కాకినాడ-విశాఖ మెము పాసింజర్ (17267), విశాఖ-కాకినాడ మెము పాసింజర్ (17268), ఈనెల 26, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875)లను రద్దు చేశామని పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

ఆలోచిస్తున్నారు. రీజియన్‌లోని కొన్ని రూట్లలోని ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కూడా ఆర్డినరీ సర్వీస్‌లుగా మార్చేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లలో కూడా ఉచిత ప్రయాణానికి అనుమతిస్తే మరో 200 బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే రీజియన్‌లోని అన్ని రూట్లలో ఆక్యుపెన్సీ రేషియోను పరిశీలించి, అతి తక్కువ ఆక్యుపెన్సీ రేషియో ఉన్న రూట్లలోని బస్సులను ఎక్కువ ఆక్యుపెన్సీ రేషియో ఉన్న రూట్లలోకి మార్పుచేయడం, గ్యారేజీలో ఉన్న 30 స్పేర్ బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి 50 కొత్త బస్సులు కొద్దిరోజుల్లో వచ్చే అవకాశం ఉందని, అవి వచ్చిన తరువాత మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికారులు భావిస్తున్నారు.

59 చోరీ కేసుల్లో 73 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

ముందస్తు చర్యలు తీసుకుంటూనే, మరోవైపు నమోదైన చోరీ కేసులను త్వరితగతిన ఛేదించేందుకు క్రైమ్ విభాగం అధికారులు, సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. గత నెల నగరంలో 84 చోరీలు జరిగితే వాటిలో 59 కేసులను ఛేదించామన్నారు. ఆయా కేసుల్లో నేరాలకు పాల్పడిన 73 మందిని అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశామన్నారు. అరెస్టు అయినవారి నుంచి 1,204 గ్రాముల బంగారం, 427.8 గ్రాముల వెండి, 5.67 లక్షల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, 430 సెల్‌ఫోన్‌లు, మూడు ల్యాప్‌టాప్‌లు, రెండు యాపిల్ ఐపాడ్స్, రూ.93 వేలు విలువైన రాగివైరు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.1.06 కోట్లు ఉంటుందన్నారు. గత ఏడాది కాలంలో చోరీకి గురైన సెల్‌ఫోన్లలో 3,330 ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందజేశామన్నారు. అనంతరం చోరీ కేసుల్లో బాధితులకు వారు పోగొట్టుకున్న నగలు, సొత్తును సీపీ చేతులు మీదుగా అందజేశారు. చోరీకి గురైన సొత్తును నిందితుల నుంచి పోలీసులు రికవరీ చేసి తమకు అందజేయడం ఆనందంగా ఉందని బాధితులు సంతోషం వ్యక్తంచేశారు. సీపీతోపాటు పోలీస్ అధికారుల కృషిని అభినందించారు. అనంతరం నగర ఏఆర్ విభాగంలో బ్యాండ్‌పార్టీకి కొత్తగా కొనుగోలుచేసిన సంగీత పరికరాలను సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏసీపీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ బిల్లులకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

విశాఖపట్నం జిల్లాలో సుమారు రూ.20 కోట్ల సాధారణ నిధులతో 400 పనులు మంజూరుచేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులను సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేసినా మంజూరుకాలేదు. దీంతో జడ్పీ సమావేశాలు, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పదేపదే సభ్యులు ప్రస్తావిస్తూ వస్తున్నారు. బిల్లులు మంజూరుకాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మొత్తం 300 పనులకు సంబంధించి రూ.11.75 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాకు జమ చేశారు. గత నెలాఖరు వరకూ చేసిన పనులకు బిల్లులు మంజూరయ్యాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మంజూరుచేసిన మిగిలిన పనులను కూడా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదనలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జడ్పీ సాధారణ నిధులతో చేపట్టబోయే పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. గత ఏడాది బిల్లులు మంజూరుకావడంతో 2025-26 సంవత్సరానికి సంబంధించిన పనులపై ఈనెల 26వ తేదీన జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ప్రస్తావించాలని సభ్యులు భావిస్తున్నారు.

పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ

డాబాగార్డెన్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగాలకు సంబంధించి యువతకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం నిర్వాహకుడు డా. బి. గంగారావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 28 నుంచి అటవీ శాఖ ఉద్యోగాలకు, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు తరగతులు జరుగుతాయని చెప్పారు. వివరాలకు డాబాగార్డెన్స్ శిక్షణ కేంద్రంలో గాని లేదా ఫోన్ 93150 15015ను గాని సంప్రతించాలని ఆయన సూచించారు.

ప్రజా సహకారంతోనే నేరాల నియంత్రణ : సీఐ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కంచరపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కంచరపాలెం శాంతిభద్రతల సీఐ రవికుమార్ అన్నారు. 47వ వార్డులోని తిక్కవానిపాలెం కాలనీలో స్థానికులకు గురువారం ఆయన నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు.మైనర్ల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత మత్తుకు బానిస అయితే జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు అప్పన్న, శంకర్, పరశయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



డ్యాన్స్ పోటీల విజేతలతో నిర్వాహకులు, డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

డాబాగార్డెన్స్ జూలై 24 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎన్‌సీఆర్‌సీ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ మారెళ్ల అన్నారు. గురువారం డాబా గార్డెన్స్‌లోని ప్రేమ సమాజం ఆడిటోరియంలో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్యాన్స్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించాలని చెప్పారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. నిర్వాహకులు ప్రసాద్ మారెళ్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వే ఫౌండేషన్ చైర్మన్ అంకయ్య, వీడీఏడీ రామారావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కూచిపూడి నాట్య అకాడమీ ఫౌండర్ వెంకటరమణ, కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ లలిత కుమార్ గుప్తా, సింగర్ సుప్రీంశేఖర్, నృత్య కళానికేతన్ మాస్టర్ గోపీనాథ్, ఎన్‌సీఆర్‌సీ స్టేట్ చైర్మన్ బళ్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి

అల్లిపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి పురస్కరించుకుని అల్లిపురంలోని శాఖా గ్రంథాలయంలో పలువురు గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈసందర్భంగా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి. కుమార్‌రాజు మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయ ఉద్యమంలో విశేషంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

రారెత్తిస్తున్న టమాటా ధర

» రోజురోజుకు ధర పెంపు
» రైతుబజార్‌లో కిలో రూ. 44
» బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 60 పైమాటే
» వినియోగదారుల గగ్గోలు



నరసింహనగర్ రైతుబజార్‌లో విక్రయిస్తున్న టమాటాలు

అక్కయ్యపాలెం,జూలై 24(ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల్లో ముఖ్యమైన టమాటా ధర రోజురోజుకు ఆకాశాన్నంటుతోంది. రైతుబజార్లలో వారం రోజుల క్రితం కిలో రూ.33, మంగళవారం రూ.39 ఉండగా, బుధవారం రూ. 44కి చేరింది. బహిరంగ మార్కెట్లలో కిలో టమాటా ధర రూ.60 వరకు పలుకుతోంది. వివిధ రకాల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుండగా, టమాటా ధర కొనుక్కోలేనంతగా ఎగబాకడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నరసింహనగర్ రైతుబజార్‌లో విక్రయాలు తగ్గిపోయాయి. ధర పెరగడంతో తక్కువమంది మాత్రమే వీటిని అమ్ముతున్నారు. టమాటా పండిస్తున్న ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పంటకు నష్టం సంభవించిందని, ఈ నేపథ్యంలో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికతో ధర ఇంకా పెరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. నగరంలోని టోకు మార్కెట్‌కు మదనపల్లి నుంచి టమాటా వస్తోంది.అక్కడ 25 కిలోల క్రేట్ ధర పెరగడంతో పాటు రవాణా ఖర్చులు కలిపితే మరింత భారమని వ్యాపారులు చెబుతున్నారు. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టమాటా పంపిణీకి చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం బొహ్రా, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫామ్‌లపై విస్తృతంగా పర్యటించి వెయిటింగ్ హాల్స్, వాటర్ బూత్స్, క్యాటరింగ్ స్టాల్స్ చెల్లింపు మరుగుదొడ్లు, పాదచారుల వంతెనలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు నిర్వహణతో పాటు పార్శిల్ కార్యాలయం కార్యకలాపాలు పరిశీలించారు. అనంతరం ప్రధాన స్టేషన్ ప్రవేశద్వారంతో పాటు జ్ఞానాపురం ప్రవేశద్వారం వైపు జరుగుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో కమర్షియల్, ఇంజనీరింగ్, ఆపరేటింగ్, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికాం తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అశోక్‌ను కలిసిన టీడీపీ నాయకులు



అశోక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును విశాఖకు చెందిన టీడీపీ నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైల ముత్యాలనాయుడు, అనసూరి మధుసూదనరావు, వాసుపల్లి రాజు, గొలగాని సౌజన్య పాల్గొన్నారు.

'వార్డు అధ్యక్షుడిగా గణేశ్‌ను కొనసాగించాలి'

మహారాణిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 29వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా ఉరుకూటి గణే శ్‌ను కొనసాగించాలని వార్డులోని కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం వారు పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం పరిశీలకుడు ఎంవీవీ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ గణేశ్ కొన్నేళ్లుగా పార్టీకి సేవలందిస్తున్నారని, వార్డు అధ్యక్షుడిగా ఆయన్ను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డులోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

అక్కయ్యపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) సీతమ్మధార మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. గురువారం సాయంత్రం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బి. దుర్గాకుమారి, ప్రధాన కార్యదర్శిగా బలిరెడ్డి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కోరాడ సతీష్‌కుమార్, జి. చలపతిరావు, కె. పుష్పలత, కార్యదర్శులుగా కర్రి సత్యనారాయణ, కె. జయవర్ధన్, ఎం. సుజాత, కె. అప్పారావు, జిల్లా కౌన్సెలర్లుగా రాయుడు శ్రీనివాసరావు, అల్లంకి శ్రీనివాసరావు, వి. విష్ణుమూర్తినాయుడు తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

'కిడ్నీ బాధితులకు అండగా ఉంటాం'

పద్మనాభం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గురువారం ఆయన రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని భద్రయ్యపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాఠశాల వద్ద ప్రజలతో మాట్లాడారు. రోగుల ఆరోగ్య సమస్యలను విన్నారు. ఎప్పటి నుంచి సమస్య ఉందని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందించాలని అధికారులను ఆదేశించారు.సమస్యను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పల్లా భవనం కూల్చివేత వ్యవహారం...

ముగ్గురిపై వేటు

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోయారు. తన భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా, రాజకీయ పలుకుబడికి తలొగ్గి కూల్చివేశారంటూ అప్పటి ప్రభుత్వానికి పల్లా శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని పల్లా కోరారు. దీంతో మునిసిపల్ మంత్రి పి.నారాయణ స్పందించి రాష్ట్రస్థాయి అధికారులతో విచారణ జరిపించగా, రాజకీయ కక్షతోనే భవనం కూల్చివేశారని, అధికారులు నిబంధనల ప్రకారం రెండుసార్లు నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదని, అర్ధరాత్రి సమయంలో భవనం కూల్చివేతలు చేపట్టకూడదని చట్టంలో ఉన్నప్పటికీ పట్టించుకోలేదని నివేదిక అందజేశారు. దీంతో అప్పటి గాజువాక డీసీపీ (ఇప్పుడు సీఆర్‌డీఏలో ఉన్నారు) నరేందర్‌రెడ్డి, అప్పటి గాజువాక టీపీఓ (ప్రస్తుతం ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో టీపీఓగా ఉన్నారు) వినయ్‌ప్రసాద్, అప్పటి టీపీఎస్ (ప్రస్తుతం పలాస టీపీఓగా ఉన్నారు) వరప్రసాద్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి చీఫ్ సిటీప్లానర్, ప్రస్తుతం రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ ఆర్జే విద్యుల్లత, అప్పటి సిటీ ప్లానర్, ప్రస్తుతం సీసీపీగా ఉన్న ప్రభాకరరావు, అప్పటి గాజువాక జోన్ కమిషనర్, ప్రస్తుతం సెక్రటేరియట్‌లో ఉన్న శ్రీధర్‌లకు షోకాజ్ నోటీసులు జారీచేసింది. భవనం కూల్చివేతలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందున ఎందుకు చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నట్టు సమాచారం. దీనిపై గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతోనే తన భవనం కూల్చివేశారని ఇప్పుడు రుజువైందన్నారు. తాను నిబంధనల ప్రకారమే భవనం నిర్మించానని, ఒకవేళ ఉల్లంఘనలు ఉంటే నోటీసులు ఇచ్చి తన సమాధానం తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలకు వెళ్లాలి తప్ప, అర్ధరాత్రివేళ నోటీసు అంటించి వెంటనే కూల్చివేయడం దారుణమన్నారు. రాజకీయ పలుకుబడికి తలొగ్గి అధికారులు నిబంధనలను పక్కనపెట్టేయడం సరికాదన్నారు. తాను పట్టుబడితే అప్పటి కమిషనర్ సృజనకు నోటీసులు ఇవ్వడంతోపాటు సీసీపీ విద్యుల్లతను కూడా సస్పెండ్ చేయవచ్చునన్నారు. ఇప్పటికైనా అధికారులు రాజకీయాలకతీతంగా పనిచేయాలని సూచించారు.

ఆ సచివాలయంలో సేవలు అంతంత మాత్రమే..

- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పలికలదొడ్డి ప్రాంత ప్రజలు
- సమయపాలన పాటించని సిబ్బంది
- ఉదయం 10.40 గంటలైనా తెరుచుకోని సచివాలయం
- అధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది ఇష్టారాజ్యం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తమ పరిధిలో గల సచివాలయంలో సేవలు తమకు అంతంత మాత్రంగానే అందుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. 77వ వార్డు (పాత వార్డు 55) పరిధి పలికలదొడ్డి కూడలిలో గల సచివాలయంలో అందుతున్న సేవలపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఉదయం 10 గంటలకు సిబ్బంది విధులకు హాజరు కావాల్సి ఉన్నా ఎవరూ రావడం లేదని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పలికలదొడ్డి జంక్షన్‌లోని సచివాలయం 10.40 గంటలైనా తెరుచుకోలేదు. ఇక్కడ


ఉదయం 10.40 గంటలకు తెరుచుకోని పలికలదొడ్డి కూడలిలోని సచివాలయం

మొత్తం ఎనిమిది మంది సిబ్బంది ఉండగా.. ఆ సమయానికి ఒక్క అడ్మిన్ మాత్రమే వచ్చారు. అయితే ఆయన వద్ద సచివాలయం తాళం లేకపోవడంతో పక్కన వేచివున్నారు. 10.45 గంటలకు ఇద్దరు మహిళా సిబ్బంది వచ్చారు. 11 గంటలైనా మిగతా సిబ్బంది ఎవరూ విధులకు హాజరు కాలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు వారి కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఉన్న సిబ్బందిని వారి గురించి అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఒకవేళ సచివాలయం నుంచి బయట ఫీల్డ్ వర్క్‌కు వెళితే బుక్‌లో రాయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అటువంటిదేమీ లేదు. ఈ సచివాలయం రూరల్ ప్రాంతంలో ఉండడం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారంతా ప్రధాన కార్యాలయానికి వెళ్లి సేవలు పొందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు తమకు పూర్తి స్థాయిలో సేవలందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


హోమంలో పాల్గొన్న భక్తులు

కాలభైరవస్వామికి పూజలు

పెదగంట్యాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని 65వ వార్డు పరిధి గరుడాద్రిపై గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరాలయ ఆవరణలో ఉన్న కాలభైరవస్వామికి గురువారం ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. వార్డు పరిధిలోని ప్రియదర్శనీ కాలనీ, సంజీవగిరి కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, గిరిజా కాలనీ, అశోక్‌నగర్ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కాలభైరవస్వామిని దర్శించుకుని పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

పెందుర్తి-రూరల్: మండలంలోని పెదగాడి గ్రామంలో స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామి ఆలయంలో గురువారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి విశ్వసాయి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా చింతాలమ్మ పండుగ

అక్కిరెడ్డిపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తుంగ్లాం ప్రజల ఆరాధ్య దేవత చింతాలమ్మ పండుగ సందర్భంగా అనుపోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని తుంగ్లాం, చుక్కవానిపాలెం, ఆటోనగర్, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులతోపాటు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు వి.వరహాలు, ఎస్.అచ్చిబాబు, వి.అప్పారావు, జి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కార్పొరేటర్

అక్కిరెడ్డిపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అందరూ మొక్కలను నాటడంతో పాటు సంరక్షణకు కృషి చేయాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. కేజీఆర్ యువసేన ఆధ్వర్యంలో తుంగ్లాంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు నావన సింహచలం, పి.అర్జున్, పి.వెంకటరమణ, జి.అప్పారావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీ వెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 44, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 28, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 26, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 20, క్యారెట్ 44, దొండకాయలు 24, బంగాళదుంపలు 17, అరటికాయ (పెద్దది) 10, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 60, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 28, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, గోరుచిక్కుడు 42, దేముడుచిక్కుడు 60, కూరపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

వైసీపీ నేతలు కటకటాలు లెక్కించాల్సిందే

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మాఫియాతో సంబంధం ఉన్న వైసీపీ నేతలందరూ కటకటాలు లెక్కించాల్సిందేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 72వ వార్డు పరిధి చినగంట్యాడ, ఎస్సీ కాలనీలో గురువారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, కుట్రలు, కుతంత్రాలు, విధ్వంసంతోనే గత ఐదేళ్ల పాలన సాగిందని విమర్శించారు. ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించకుండా విధ్వంసకరమైన నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి వైసీపీ నెట్టివేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూడలేక వైసీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ పల్లా శ్రీనివాసరావు, తదితరులు కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, కన్నారావు, రామారావు, విల్లా రామ్మోహన్‌కుమార్, నాగేశ్వరరావు, విజయసాయి, మాధవరావు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

ఉక్కు అడ్మిన్ భవనం వద్ద నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో తొలగించిన నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్లాంట్ అడ్మిన్ భవనం ముందు ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు లేబర్ యూనియన్, ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిర్వాసితుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు నలభై ఏళ్లుగా అన్యాయం జరుగుతుందన్నారు. నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని, గేట్లు ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రవి, పీతన భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, జి.రామకృష్ణ, ప్రసాద్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

దోచుకోవడం..దాచుకోవడమే జగన్ నైజం

టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు

కూర్మన్నపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ విధానమంతా దోచుకోవటం-దాచుకోవడమేనని టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు అన్నారు. 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలనలో ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకుడు ఆడారి రామకృష్ణ, అధ్యక్షుడు బొడ్డేడ నాయుడు, నాయకులు పప్పు శంకరరావు, ప్రతాపరావు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


శ్రీనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి శ్రీనివాస నగర్‌లో గురువారం టీడీపీ శ్రేణులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గొల్లవిల్లి కనకభవానీ, ఎం.వెంకటరావు, హరిబాబు, పీఎస్ నాయుడు, జి.వెంకటరావు, రామారావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33-11 కేవీ నాగమల్లి ఫీడర్ మరమ్మతు పనులు నిర్వహించనున్నామని జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గిరిప్రసాద్‌నగర్, సుజాతనగర్ సీ-1సీ-2 జోన్లు, కార్మికనగర్, వెంకటాద్రినగర్, ఆంజనేయనగర్, విరాట్‌నగర్, టీచర్స్ లేఅవుట్, డాక్‌యార్డు లేఅవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారుల గుర్తించి సహకరించాలని కోరారు.

గోపాలపట్నం/ వేపగుంట (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వాహణలో భాగంగా గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ బి.సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటాపురం, ఆర్ఆర్ వెంకటాపురం, మూడుగుళ్ల ఏరియా, అజంతాపార్క్ కాలనీ, ఎస్సీబీసీ కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

కొత్తపాలెంలో 'పొలం పిలుస్తోంది'

గోపాలపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ అన్నారు. ఈ సందర్భంగా కొత్తపాలెం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించిన రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

శ్రీవారికి శ్రావణమాస పూజలు

వేపగుంట, జూలై 24(ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలవైన కల్యాణ వెంకటేశ్వర ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని 5 శుక్రవారాలు ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు తెలియజేశారు. నేడు తొలి శుక్రవారం సందర్భంగా సాయంత్రం ఆలయం లో సామూహిక లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. భక్తులు ఈ పూజలో పాల్గొని స్వామివారి ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ అర్చకులు కోరారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

అక్కిరెడ్డిపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ నుంచి షీలానగర్‌కు వచ్చే చుక్కవానిపాలెం రోడ్డులో ప్రమాదాల నివారణకు గాను గురువారం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. 69వ వార్డు కూటమి నాయకుడు కరణం ముత్యాలనాయుడు వీటిని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

- పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

సింధియా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 40వ వార్డులో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఏడాదిలో కూటమి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.గణబాబు

దోచుకోవడం, దాచుకోవడం కూటమికి తెలియదు

వేపగుంట: వైసీపీ పాలనలో దోచుకోవడం, దాచుకోవడం వల్లే ఇప్పుడు ఆ పార్టీ చెందిన నాయకులు జైల్లో ఉన్నారని పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. గురువారం జీవీఎంసీ 94వ వార్డులో నిర్వహించిన 'తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దు బండిలా నడుపుతున్న ఘనత కూటమికే సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు

- వైసీపీ 'అనకాపల్లి' పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి

పెందుర్తి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కూటమి గద్దెక్కిందని, కానీ పథకాల అమలు చేయడంలో క్లీన్ బౌల్డ్ అయ్యిందని వైసీపీ అనకాపల్లి జిల్లా పార్లమెంటరీ పరిశీలకురాలు మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి అన్నారు. చంద్రబాబు హయాంలో మహిళలకు రక్షణ లేదని, రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చారని ఆరోపించారు. బాబు 'ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో హైమావతి మాట్లాడుతూ 'ఎన్నికల ముందు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ. అధికారంలోకి రాగానే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' అనే పద్ధతిలో పాలన సాగుతోందని అన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదీప్‌రాజ్, హైమావతి,తదితరులు

అదీప్‌రాజ్ మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా పాలనలో జరుగుతున్న వైఫల్యాలను ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం రీసైక్లింగ్ చంద్రబాబు పోస్టర్‌ను అదీప్‌రజ్, హైమావతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు ఘన నివాళి

మల్కాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి వెంకటరమణయ్య చేసిన సేవలు ఎనలేనివని రాష్ట్ర ప్రభుత్వ కళరత్న అవార్డు గ్రహీత సుంకర చలపతిరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణ్య జయంతి వేడుకలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడమే అయ్యంకి లక్ష్యమని, గ్రంథాలయాలను ప్రజలకు చేరవేసిన గొప్పదనం ఆయనదేనని తెలిపారు. పౌరహక్కులు సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపల శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ దేవాలయాలకంటే గ్రంథాలయాలే ముఖ్యమని భావించిన వ్యక్తి రమణయ్య అని అన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు క్విజ్ పోటీలను జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి సమక్షంలో జరిగాయి. విజేతలకు సర్టిఫికేట్లు, జ్ఞాపికలను అందజేశారు.

గ్రంథాలయాలకు ఎనలేని సేవలు

గోపాలపట్నం (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల వ్యవస్థాపనకు అయ్యంకి వెంకటరమణ చేసిన సేవలు ఎనలేనివని స్థానిక గ్రంథాలయాధికారి ఎన్‌వీ. నరిసింహం తెలిపారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో రమణయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యంకి చిత్రపటానికి పూలమాలవేసి నరసింహం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

షిర్డీ సాయినాథునికి పూజలు

అగనంపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో స్థానిక షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సాయిబాబాను నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన చేపట్టారు.


నాగభూషణం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

జోసెఫ్, నాగభూషణంలకు 'పల్లా' నివాళి

కూర్మన్నపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జోసెఫ్, తిరుమలనగర్ కాలనీ అధ్యక్షుడు జి.నాగభూషణంల మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మృతుల ఇళ్లకు గురువారం ఆయన వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలపై పువ్వులు చల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, జోసఫ్ కుమారుడు పాల్, నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, రమేష్,జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, సన్యాసిరావు, వసంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

అధికారులకు కార్పొరేటర్ బొంగా జగన్ విజ్ఞప్తి

కూర్మన్నపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ గురువారం జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఏ ఏ ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదో, క్లోరినేషన్ పరీక్షల గురించి ఏఈ కేధారినాథ్‌కు కార్పొరేటర్ వివరించారు. కొళాయిల ద్వారా సరఫరా అయ్యే నాటిని ఎవరూ వృథాగా విడిచిపెట్టరాదని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా బొండా జగన్ మాట్లాడుతూ సిద్ధార్థనగర్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ 86, 87 వార్డులకు నీటి సరఫరా చేస్తుందని, ఎంవీవీఎంకేతో పాటు పలు బహుళ అంతస్థులు పెరిగిపోవడంతో నీటి సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు కౌన్సిల్‌లో ప్రస్తావించామన్నారు. జనసాంద్రత పెరిగినందున 87వ వార్డులో మరో 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటును నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, కె.శ్రీను, కృష్ణ, దానయ్య, జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, బి.ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్'లో స్వచ్ఛ క్యాంపస్ అభియాన్

అగనంపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛ క్యాంపస్ అభియాన్-2025 కార్యక్రమాన్ని చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై విద్యార్థులు ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ప్రిన్సిపాల్ జె.సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తామెంతో కృషి చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులంతా కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ అధికారి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ మహాసభలను విజయవంతం చేయాలి

పెదగంట్యాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 26 జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) 5వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు పి.దుర్గారావు కోరారు. పెదగంట్యాడలో గురువారం జరిగిన డీహెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఈ మహాసభలు జరగనున్నాయని, పలువురు ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. నాయకులు పెట్ల వెంకటరమణ, జి.ఆనంద్, ఎ.పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ర్యాలీ

మల్కాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత మద్దతు పలకడం అన్యాయమని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు అన్నారు. జీవీఎంసీ 58వ వార్డులో సీపీఎం నాయకులు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఖరీదు రూ.9 వేలను వినియోగదారులలే చెల్లించాలని దాని వల్ల సామ్యానుల మీద ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రిని ప్రభుత్వమే నడిపి, వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలి

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు


సింహాచలం డిపోలో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఆర్ఎమ్.అప్పలనాయుడు

వేపగుంట, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తోందని ఆర్ఎం బి.అప్పలనాయుడు అన్నారు. గురువారం సింహాచలం డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని, ప్రతి స్టాప్‌లోను మహిళలను తప్పకుండా బస్సులో ఎక్కించుకోవాల్సిన బాధ్యత కండెక్టర్‌పై ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శరత్‌బాబు, అసిస్టెంట్ డీఎమ్.రమణమూర్తి, ఇంజనీర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రైతుల భూ పత్రాల పరిశీలన

వేపగుంట, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎంఆర్‌డీఏ భూ వివాదానికి సంబంధించి రైతులు రికార్డుల పరిశీలన గురువారం ఉదయం వేపగుంట కల్యాణ మండపంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా రైతులు తమ భూ పత్రాలను తీసుకువచ్చి అధికారుల దగ్గర వివరాలు నమోదు చేయించుకున్నారు. పాత రికార్డుల ప్రకారం రైతుల పేర్లు ఉన్నప్పటికీ, ప్రస్తుత యజమానుల వివరాలను కూడా పరిగణలోకి తీసుకున్నారు. దీంతో త్వరలో భూమిని కొనుగోలు చేసేవారి వివరాలను కూడా నమోదు చేసుకున్నారు. ఈ నమోదు ప్రక్రియ మరో రెండు రోజులు కొనసాగుతుందని వీఎంఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పల్గొన్నారు.

బెహరా కళాశాలలో 'ఏక్ పేఢ్ మాకినామ్'

గోపాలపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో 'ఏక్ పేఢ్ మాకినామ్' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సస్, కస్టమ్స్ డైరెక్టర్ జనరల్ ఈ.రవికుమార్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకం కాకుండా ఉండడానికి నేడు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిమీద ఉన్నదని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో నేడు అవిశ్వాస తీర్మానం

మల్కాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ కో-ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం పై శుక్రవారం పలువురు డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రకటించనున్నారు. పాలకవర్గంలో కీలకమైన అధ్యక్షుడు, కార్యదర్శి కార్మికులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, వీరి వల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతోందని పలువురు డైరెక్టర్లు ఇటీవలే జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ అధికారులకు లేఖ ద్వారా తెలియజేశారు. ఈ మేరకు జూలై 25న అవిశ్వాసతీర్మానం పై ప్రకటన ఉంటుందని నోటీసులు జారీ చేశారు. అవిశ్వాసతీర్మానం చేసిన తరువాత నూతన కార్యవర్గ ఎన్నికలు వెంటనే జరుగుతాయని తెలిపారు.

మాక్‌డ్రిల్‌లో గాయపడిన బాలికకు ఆర్థిక సాయం



మనస్వి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందిస్తున్న పోలీస్, ఎన్ఐజీ, బీడీఎల్ అధికారులు

కూర్మన్నపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ బీడీఎల్ (భారత్ డైనమిక్ లిమిటెడ్) సంస్థలో మంగళవారం రాత్రి నిర్వహించిన మాక్‌డ్రిల్ సందర్భంగా గాయపడిన బొమ్మిడి సురేంద్ర వర్మ కు మార్తె మనస్వి(8)కి చికిత్స ని మిత్తం రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పోలీసులు, ఎన్ఐజీ అధికారులు, బీడీఎల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ బాలిక తల్లిదండ్రులు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు సమాచారం ఇవ్వడంతో ఎమ్మెల్యే కలెక్టర్, సీపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దువ్వాడ పోలీసులు, ఎన్ఐజీ, బీడీఎల్ అధికారులకు మనస్వి వైద్యానికి అయ్యే ఖర్చులను భరించారు. అంతేకాకుండా బాలిక ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ఆమె తల్లిదండ్రులకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ ఎస్ఐ డి.శ్రీనివాసరావు, ఎన్ఐజీ, బీడీఎల్ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పోలీస్‌శాఖ ప్రతిష్ఠ పెంచాలి: సీపీ



ప్రొబేషనరీ ఎస్ఐలతో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పోలీస్‌శాఖ ప్రతిష్ఠను పెంచాలని ప్రొబేషనరీ ఎస్ఐలకు సీపీ శంఖబ్రతబాగ్చి ఉద్బోధించారు. నగరానికి కేటాయించిన 34 మంది గురువారం సీపీకి రిపోర్టు చేశారు. కేటాయించిన స్టేషన్‌లకు వెళ్లి సమస్య పరిష్కారానికి వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించడం స్వాంతన కలిగించాలని సూచించారు. సమావేశంలో డీసీపీలు, ఏడీసీపీలు పాల్గొన్నారు.

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రీస్ లైన్, గాయత్రినగర్, ఘంటసాలవారి వీధి, విజయవాడ, కృష్ణా జిల్లా-520008

సెక్యూర్డ్ స్థిరాస్తుల అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 రూల్ 8(6) క్రింద జారీచేయబడినది)

టు:

ఋణగ్రహీత: శ్రీమతి నక్కా కావేయేశ్వరి, భర్త: జి. నవీన్ కుమార్, డి.నెం. 2-13, అగనంపూడి మెయిన్ రోడ్, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్, స్టీల్‌ప్లాంట్ రోడ్డు, విశాఖపట్నం-530046, ఎ.పి., మరియు **సహ-ఋణగ్రహీత:** శ్రీ గుల్లా నవీన్ కుమార్, తండ్రి: శంకర్‌రావు, డి.నెం. 2-13, అగనంపూడి మెయిన్ రోడ్, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్, స్టీల్‌ప్లాంట్ రోడ్డు, విశాఖపట్నం-530046, ఎ.పి., మరియు **హామీదారు:** శ్రీ నక్కా విజయ కుమార్, తండ్రి వెంకటరావు (లేటు), డి.నెం. 2-126, అగనంపూడి మెయిన్ రోడ్, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్, స్టీల్‌ప్లాంట్ రోడ్డు, విశాఖపట్నం-530046, ఎ.పి.,

(లోన్ అకౌంట్ నెం. 96009854100 – రూ.15 లక్షలు)

"ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002" నందలి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం ఉద్దేశిత అమ్మకపు ముందస్తు ప్రకటన.

మీరు మా **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, గాజువాక బ్రాంచ్, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్,** ఋణ సౌకర్యాలను పొందినారు. సదరు తెలిపిన షెడ్యూలు ఆస్తిని తనఖా పెట్టి పొందిన మంజూరు యొక్క నిబంధనలు మరియు షరతుల ప్రకారం మీ ఖాతా లేదు. మీరు బ్యాంక్‌కు బకాయిను చెల్లించడంలో విఫలమయ్యారు మరియు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన నోటీసులో బకాయి మొత్తాన్ని చెల్లించాల్సిందిగా మిమ్ములను కోరడమైనది. మీరు 60 రోజులలోగా బకాయి చెల్లించనట్లయితే బ్యాంకు తన హక్కును వినియోగించుకుని మీ సెక్యూరిటీలను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది.

మీరు చెల్లింపులు చేయడంలో విఫలమైనందున, అధీకృత అధికారి దిగువ షెడ్యూలులో మరింత పూర్తిగా వివరించిన సెక్యూరిటీలను స్వాధీనం చేసుకున్నారు.

చట్టంలోని సెక్షను 13(4) ప్రకారం ప్రకారం, షెడ్యూలు సెక్యూరిటీల విక్రయాన్ని ప్రభావితం చేయడానికి మరియు ఖర్చులు, ఛార్జీలు మరియు బాకీ ఉన్న బ్యాలెన్సుల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రహించడానికి బ్యాంక్‌కు హక్కు ఉంది. దీని ప్రకారం, దిగువ సంతకందారు క్రింద వివరించిన షెడ్యూల్‌లోని సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించాలని ఉద్దేశించడమైనది. ఈ నోటీసు తేదీ నుండి 30 రోజుల గడువు ముగిసిన ప్రజల నుండి టెండర్లను ఆహ్వానించడం ద్వారా తర్వాత విక్రయం నిర్వహించబడుతుందని ఉద్దేశించబడింది. ఉద్దేశిత అమ్మకానికి పెట్టదల్చిన సెక్యూర్డ్ ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరాలు దిగువున తెలుపబడినవి.

స్థిరాస్తి వివరములు

విశాఖపట్నం జిల్లా, జివియంసి, అనకాపల్లి రెవెన్యూ డివిజన్, గాజువాక మండలం, అగనంపూడి గ్రామం, సర్వే నెం. 99 లో ఉన్న **100 చ॥గ॥ల లేదా 83.613 చ॥మీ॥ల ఖాళీ భూమి యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు:** తియ్యలి శంకరయ్య యొక్క స్థలం మరియు ఇతరుల యొక్క దారి, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** నక్కా విజయ కుమార్ గారికి చెందిన స్థలం, **ఉత్తరం:** రోడ్డు.

లంకెలపాలెం యస్ఆర్ఓ, రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 1913/2022 తేదీ 13-04-2022 ప్రకారం శ్రీమతి నక్కా కావేయేశ్వరి, భర్త: జి. నవీన్‌కుమార్ గారికి చెందిన ఆస్తి.

తేది: 21.07.2025, ప్రదేశం : విజయవాడ — సం/- అధీకృత అధికారి, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రీస్ లైన్, గాయత్రినగర్, ఘంటసాలవారి వీధి, విజయవాడ, కృష్ణా జిల్లా-520008

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(అపెండిక్స్ IV SARFAESI చట్టం నందలి రూల్-8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54/2002) ప్రకారం **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, కొమ్మాది బ్రాంచ్, విశాఖపట్నం జిల్లా** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన తేది. 02-05-2025 నాటికి బకాయి **(కోస్టల్ హోమ్ లోన్ - టర్మ్ లోన్ అకౌంట్ నెం.1: 96009592062, కోస్టల్ హోమ్ లోన్ - టర్మ్ లోన్ అకౌంట్ నెం.2: 96009592222 మరియు కోస్టల్ హోమ్ లోన్ - టర్మ్ లోన్ అకౌంట్ నెం.3: 96009592244)** క్రింద రూ. **34,64,758/- (ముప్పై నాలుగు లక్షల అరవై నాలుగు వేల ఏడు వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు తేది. **02-05-2025** నుండి వడ్డీ కలుపుకుని మొత్తమును చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత:** శ్రీమతి గుడిమెట్ల సుజాత, భర్త: గుడిమెట్ల శ్రీనివాస్‌రెడ్డి, డి.నెం. 9-31-7/10, బయానాస్ ఎన్క్లేవ్, 3వ అంతస్తు, పిఠాపురం కాలనీ, కళాభారతి రోడ్డు, మద్దిలపాలెం, విశాఖపట్నం-530003. ఎ.పి మరియు **సహ-ఋణగ్రహీత:** శ్రీ గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, తండ్రి: జి.వి. రెడ్డి, డి.నెం. 9-31-7/10, బయానాస్ ఎన్క్లేవ్, 3వ అంతస్తు, పిఠాపురం కాలనీ, కళాభారతి రోడ్డు, మద్దిలపాలెం, విశాఖపట్నం-530003. ఎ.పి మరియు **హామీదారు:** శ్రీ షేక్ చౌదరిబాబు, తండ్రి: షేక్ మస్తాన్, డి.నెం. 53-39-31, కెఆర్ఎం కాలనీ, సీతమ్మధార, సియంఆర్ హౌస్ దగ్గర, విశాఖపట్నం (అర్బన్), విశాఖపట్నం-530013, ఎ.పి., వారిని కోరుతూ **తేది.09.05.2025**న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

సదరు ఋణగ్రహీత డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 చట్టంలోని సెక్షన్ 13, సబ్-సెక్షన్(4) కు అనుబంధమైన రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని **22.07.2025** తేదిన స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత/హామీదారు, ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారులు మరియు ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైనా తేది. 02.05.2025 నాటికి బకాయి బకాయి **రూ. 34,64,758/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల అరవై నాలుగు వేల ఏడు వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు మొదలగునవి **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, కొమ్మాది బ్రాంచ్, విశాఖపట్నం** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. ఒకవేళ డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత జమలు ఉన్నట్లయితే అవి సర్దుబాటు చేయబడును.

సర్ఫేసీ చట్టం సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తి వివరములు:

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, విశాఖపట్నం, వాల్తేర్ వార్డు, అడ్ బిట్ ప్లాట్ నెం.1, పిఠాపురం ఉడాలేఅవుట్, టి.యస్.నెం. 46 & యస్.నెం. 1/1A11A లో 360 చ॥గ॥ల లేదా 301.008 చ॥మీ॥ల స్థలం. **మొత్తం స్థలానికి హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 15 MIG, **దక్షిణం:** అడ్ బిట్ నెం. 2A మరియు ప్రైవేట్ భూమి, **పడమర:** 40 అ॥ల వెడల్పు రోడ్డు & మేడిశెట్టి లక్ష్మి మరియు మేడిశెట్టి సత్యనారాయణ మిగిలిన ఆస్తి, **ఉత్తరం:** గంటి అపార్ట్‌మెంట్. అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా 36.50 చ॥గ॥ లేదా 30.51 చ॥మీ॥లు విస్తీర్ణంతో "బయానా ఎన్క్లేవ్" యొక్క గ్రౌండ్ ఫ్లోర్‌లోని 810 చ॥అ॥ (సాధారణ ప్రాంతాలు మరియు బాల్కనీలు సహా) డోర్ నెం. 9-31-7/3(జిఎఫ్ -1), మున్సిపల్ అసెస్‌మెంట్ నెం. 42500/1234, విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌తో ఉన్న ఫ్లాట్ నెం.GF-1. **గ్రౌండ్ ఫ్లోర్ లోని ఫ్లాట్ నెం. జిఎఫ్-1 హద్దులు: తూర్పు:** మెట్లు, **దక్షిణం:** ప్రహారీ గోడ, **పడమర:** ప్రహారీ గోడ, **ఉత్తరం:** పార్కింగ్ స్థలం. జెయస్ఆర్ఓ విశాఖపట్నం, రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 7283/2017, తేదీ 21-11-2017 ప్రకారం శ్రీమతి గుడిమెట్ల సుజాత, భర్త: జి. శ్రీనివాసరెడ్డి పేరున రిజిస్టర్ చేయబడింది.

తేది : 22.07.2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పాఠశాలలు, ఆస్పత్రులను సందర్శించిన కలెక్టర్



వార్డులో పర్యటిస్తున్న కలెక్టర్



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. జీవీఎంసీ 29వ వార్డు ప్రకాశరావుపేట, పితానిదిబ్బ, అల్లిపురం వీహెచ్‌సీ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. దోమలు వ్యాప్తి చెందకుండా చేపట్టాల్సిన పారిశుధ్య చర్యలపై జీవీఎంసీ అధికారుతో సమీక్షించారు పరిశుభ్రత పనులు పక్కాగా చేపట్టాలని, డ్రైయిన్‌లు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి, వ్యాధులు వ్యాప్తిచెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రకాశరావుపేట ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు అల్లిపురం అర్బన్ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేశారు. వైద్య సేవలపై రోగులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మెడికల్ అధికారి నరేశ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవలు మెరుగుపర్చాలి

- సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవలను మెరుగు పర్చాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి పేర్కొన్నారు. ఆస్పత్రిలోని సెమినార్ హాల్‌లో గురువారం వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో అందించే వైద్యసేవలతో ఆస్పత్రికి ఆదాయం వస్తోందన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించవద్దన్నారు. సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ప్రతి డిపార్ట్‌మెంట్ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలకు సంబం ధించి ఒక నోడల్ అధికారి ఉండేలా చూడాలన్నారు. దీనివల్ల మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలో అందించే చికిత్సలు ద్వారా భారీమొత్తంలో ఆస్పత్రికి ఆదాయం లభిస్తుందని, దీనివల్ల మరింత మంది పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించే సదుపాయాలను కల్పించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ మాట్లాడుతూ రోగులకు సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం కూడదన్నారు. మెరుగైన సేవలందించేందుకు అన్ని మార్గాలను వినియోగించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి

వీరమల్లుగా పవన్‌కల్యాణ్ నటన అద్భుతం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కితాబు



సినిమా చూస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

మద్దిలపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): 'హరిహర వీరమల్లు' సినిమాలో వీరమల్లుగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అద్భుతంగా నటించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కితాబునిచ్చారు. ఆయన గురువారం మద్దిలపాలెంలోని కిన్నెర-కామేశ్వరి కాంప్లెక్స్‌లో సినిమాను వీక్షించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ రాజకీయ, సినీ రంగాల్లో పవన్ కల్యాణ్ పవర్‌స్టారేనని కొనియాడారు. మంచి కథతో సందేశాత్మకమైన వీరమల్లు సినిమాను సమాజానికి అందించారని ప్రశంసించారు.

శ్రావణ మాసోత్సవాలకు అప్పన్న ఆలయం ముస్తాబు

సింహాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసోత్సవాలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం వరాహల క్ష్మీ నృసింహస్వామి దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ప్రతి శుక్రవారం ఉదయం 7 నుంచి 9గంటల వరకు సింహవల్లీ తాయారు సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సాయంత్రం 5 గంటలకు సహస్రనామ కుంకుమార్చన, 6.30గంటలకు అమ్మవార్ల తిరువీధి ఉత్సవాలు జరుగుతాయని ఈఓ వేంద్ర త్రినాధరావు తెలిపారు. లక్ష కుంకుమార్చనకు రూ.2500, సహస్రనామ కుంకుమార్చనకు రూ.500 టికెట్లను ప్రజాసంబంధాల అధికారి కార్యాలయం, ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. ఆగస్టు 22న సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహిస్తామన్నారు. స్వాతి హోమాన్ని 29న నిర్వహిస్తామన్నారు.

పలు అంశాలపై అధికారులతో సీఎస్ సమీక్ష

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్, ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజాభిప్రాయం, సిటీలో గ్యాస్ పంపిణీ, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్, డీఆర్వో బీహెచ్. భవానిశంకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగదీశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు ఆదిశేషు, జిల్లా పర్యాటక అధికారిణి జె.మాధవి, సమాచారశాఖ డీడీ కె.సదారావు, ఎన్టీఆర్ వైద్య సేవాట్రస్టు జిల్లా కోఆర్డినేటరు డాక్టరు కొయ్యాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఆపండి

- జీవీఎంసీ కమిషనర్‌కు వైసీపీ నేతల వినతిపత్రం



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నేతలు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసతీర్మానం, కొత్తవారి ఎన్నిక సమయంలో పార్టీ విప్‌ను ధిక్కరించిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకునేవరకు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికను నిలుపుదల చేయాలని వైసీపీ నేతలు గురువారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. విప్‌ను ధిక్కరించిన వారిపై చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశామన్నారు. చర్యలు తీసుకోకపోవడంతో హైకోర్టులో కేసు వేశామని, గడువుదాటినా చర్యలు తీసుకోలేదని, మరోసారి హైకోర్టును ఆశ్రయించనున్న నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఆపాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు, నేతలు తైనాల విజయ్‌కుమార్, బానాల శ్రీనివాసరావు, కట్టమూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పౌర రక్షణ వలంటీర్ల సేవలు ఆదర్శం: జీవీఎంసీ కమిషనర్



శిక్షణ పొందిన వలంటీర్లు, సంస్థ సిబ్బందితో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

సీతంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పౌర రక్షణ వలంటీర్ల సేవలు ఆదర్శమని, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. గురుద్వార కూడలి శాంతిపురంలోని పౌర రక్షణ సంస్థలో 54 మంది వలంటీర్లు శిక్షణ పూర్తిచేసుకున్న సందర్భంగా వారికి ధ్రువపత్రాలు అందజేశారు. సంస్థ ఉప పౌరరక్షణ అధికారి ఎ.మధుసూదనరావు మాట్లాడుతూ వలంటీర్లు అత్యవసర పరిస్థితుల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందుండాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.శ్రీనివాస రాజమణి, విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ పి.రామారావు, వైద్య సిబ్బంది ఎం.వరప్రసాద్, ఫైర్ ఆఫీసర్ ఏవీ రమణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలి

- సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి



ఉక్కు నేతలతో ఆర్.నారాయణమూర్తి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, మౌలిక వసతులు, ప్రభుత్వ రంగ పరిశ్రమల ను ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని, వీటిని వ్యతిరేకిస్తూ ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. సీఐటీయూ ప్లాంట్ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వాలు తొందరపడుతున్నాయని, కార్పొరేటీకరణతో దేశం ప్రమాదకర స్థితికి చేరుకుంటుందన్నారు. ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల ఎంతోమంది ఉపాధి కోల్పోయి రోడ్డునపడతారని పేర్కొన్నారు. సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమంతోనే ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటున్నామ న్నారు. సమావేశంలో నాయకులు యు.రామస్వామి, కె.గంగాధర్, పుల్లారావు, బాలశౌరి, శ్రీనివాస్, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంలో సమస్యల పరిష్కారానికి కృషి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

మహారాణిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హామీ ఇచ్చారు. పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మాధవ్‌ను గురువారం హోటల్ దసపల్లాలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఎఫ్ఏపీసీసీఐ, హెచ్ఆర్ఏపీ, వీసీసీఐ సంయుక్తంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రతినిధులు సమస్యలు, సూచనలతో కూడిన సమగ్ర నివేదికను మాధవ్‌కు అందజేశారు. రాష్ట్రంలోని వ్యాపార పరిశ్రమలు జాతీయస్థాయిలో గుర్తింపు సాధించేలా సహకరించాలని కోరారు. ముఖ్యంగా పోర్టు లాజిస్టిక్స్, టూరిజం హాస్పిటాలిటీ, ఫార్మారంగం, ఎంఎస్ఎంఈ, రియల్ ఎస్టేట్, ఐటీ, ఈవీ, ఎస్ఈజెడ్ తదితర రంగాలకు చెందిన సమస్యలు ప్రస్తావించారు. కార్యక్రమంలో వాణిజ్య సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



మాధవ్‌ను సత్కరిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఏయూ అభివృద్ధికి దివీస్ కృషి నిరుపమానం

- ఉప కులపతి జీపీ రాజశేఖర్
- ఆధునికీకరించిన కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం
- వర్సిటీకి 72 ఆర్వో ప్లాంట్ల బహూకరణ

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు దివీస్ ల్యాబొరేటరీ అందిస్తున్న సాయం ఎంతగానో దోహదపడుతుందని వైస్‌చాన్సలర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. దివీస్ ల్యాబొరేటరీ లిమిటెడ్ రూ.3.21 కోట్ల ఆర్థికసాయంతో చేపట్టిన పలు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఇందులో రూ.49.96 లక్షలతో ఆధునికీకరించిన కెమిస్ట్రీ ల్యాబొరేటరీ-2, రూ.2.36 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 72 వాటర్ ప్లాంట్లను వర్సిటీ అధికారులకు అందించారు. తొలుత వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌తో కలిసి దివీస్ ల్యాబొరేటరీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్‌వీ రమణ, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం పరిపాలనా విభాగం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీలోని వివిధ విభాగాలకు 72 ఆర్వో ప్లాంట్ యూనిట్లను బహూకరించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ మాట్లాడుతూ దివీస్ సంస్థ కల్పించిన ఈ మౌలిక వసతులు విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచేందుకు దోహదపడతాయన్నారు. శతాబ్ది ఉత్సవాల సమయంలో పరిశ్రమలు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏయూకు విరాళాలను అందించడంతోపాటు మౌలిక వసతులను కల్పించం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇదే సహకారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, దివీస్ ల్యాబొరేటరీ సీఎస్ఆర్ మేనేజర్ డి. సురేశ్‌కుమార్, ప్రొఫెసర్ కె.బసవయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రయోగశాలల్లో ఫ్యూమింగ్ చాంబర్, డ్రై ఒవేన్, వాక్యూమ్ ఒవేన్, రసాయనాలను నిల్వ చేసుకోవడానికి స్టోరేజీ, అవసరమైన రసాయనాలు అందించారు.



కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్, చిత్రంలో దివీస్ ప్రతినిధులు

మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు, జరిమానా

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముద్దాయికి ఏడాదిన్నర జైలుశిక్ష, రూ.15వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి.ప్రదీప్ గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో నెల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాలపట్నం బాజీజంక్షన్‌కు చెందిన ముద్దాయి ఉరిటి రవీంద్ర (26) ఎన్ఏడీ కొత్తరోడ్డు సమీపంలో ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన 2019 జనవరి 26న జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని 25.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై గురువారం తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన మహ్మద్ ఉమర్ మున్నావర్ హుస్సేన్ షేక్, ఒడిశాకు చెందిన శక్తిమాన్ జైనా, సీను రైతా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారని, వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

ఏయూ విద్యార్థికి మెరుగైన చికిత్స

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్టు ఏయూ అధికారులు వెల్లడించారు. వైస్ చాన్సలర్ సూచనలతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.వెంకటరావు గురువారం కేజీహెచ్‌కు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

నేడు ఐటీఐ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

కంచరపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా కంచరపాలెం బాలికల ఐటీఐలో మిగులు సీట్లకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. బాలికల ఐటీఐలో ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, కోపా, డ్రస్ మేకింగ్ తదితర ట్రేడుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బాలికలు అన్ని ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

నేడు న్యాయవాదుల మహాధర్నా

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం న్యాయవాదులు మహాధర్నా చేపట్టనున్నట్టు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు, న్యాయవాదుల చట్టసవరణ, న్యాయమూర్తుల భర్తీ, అర్హులకు ఇళ్ల స్థలాలు తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఉదయం 11.30కు న్యాయవాదులంతా పాల్గొనాలని కోరారు.